ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 43.0
కనిష్ఠం : 27.0

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
5
బుధవారం 8 మే 2024



కూటమి..కేక

పోలింగ్ సమయం సమీపిస్తోంది. వైసీపీకి దీటుగా కూటమి పక్షాన ఎంపీ అభ్యర్థులు పుట్టా మహేష్ కుమార్ యాదవ్, శ్రీనివాసవర్మ అటు ప్రచారంలోనూ ఇటు ఎత్తుగడలలోనూ పైచేయిగా నిలుస్తున్నారు. తమ టీమ్ ఎమ్మెల్యే అభ్యర్థులతో దూసుకుపోతున్నారు. సామాజిక వర్గాలకు చెందినవారే కాక ఇప్పటి వరకు వైసీపీలో ఉన్న కార్యకర్తలు కూడా కూటమిలో చేరేందుకు ఎంపీ అభ్యర్థుల సమక్షంలోనే క్యూ కడుతున్నారు. దాదాపు అన్ని నియోజక వర్గాల్లో ఈ తాకిడి పెరగడం, రాబోయే ఫలితాలకు ఒక సంకేతంగా ఉందని కూటమి భావిస్తోంది. ఇప్పటికే ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ప్రచారంలో, ప్రజలకు మరింత చేరువ అవ్వడంలో కూటమి పక్షాన మేనిఫెస్టో ప్రజలకు చేర్చడంలోనూ ముందు వరుసలో ఉన్నట్టు అంచనా వేస్తున్నారు.

- ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి

- ప్రచారం, ఎత్తుగడల్లో ఎంపీ అభ్యర్థులు పుట్టా,వర్మదే పై చేయి
- అన్నిచోట్ల సైకిల్ అభ్యర్థుల జోష్
- జనసేన అభ్యర్థులది దూకుడే
- అధికార వైసీపీ నివ్వెరపోయేలా కూటమి ఎత్తుగడలు
- ఈ మూడురోజులు ఊరువాడ హోరే
- ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ప్రచార సరళి


చింతలపూడి మండలం గొల్లగూడెం సభలో మాట్లాడుతున్న ఏలూరు టీడీపీ ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్


ఏలూరు శనివారపుపేటలో కూరగాయల వ్యాపారితో మాట్లాడుతున్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బడేటి చంటి


కొయ్యలగూడెంలో పోలవరం జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి బాలరాజు ఎన్నికల ప్రచారం


పెదవేగి మండలంలో ప్రభాకర్‌కు గజమాలతో సత్కారం


జంగారెడ్డిగూడెంలో ప్రచారం చేస్తున్న చింతలపూడి టీడీపీ అభ్యర్థి రోషన్ కుమార్

ఎంపీ అభ్యర్థుల హవా

ఏలూరు లోక్‌సభ స్థానం నుంచి కూటమి అభ్యర్థిగా పోటీలో నిలబడిన పుట్టామహేష్‌యాదవ్ ప్రచారంలో వినూత్నంగా వ్యవహరిస్తున్నారు. తనకంటూ ఒక ఆత్మీయ బలగాన్ని చేరువ చేసుకోవడానికి ఆయన ఇప్పటికే ప్రతి నియోజకవర్గంలోనూ విస్తృతంగా పర్యటించగలిగారు. తక్కువ సమయంలోనే ఎక్కువ ప్రాంతాలను మహేష్ యాదవ్ సందర్శించగలిగారు. ఓ వైపు కూటమి బిగ్‌బాస్‌లు ప్రచారానికి ఆయా నియోజకవర్గాలకు వస్తుండటం వాటిల్లో పాలుపంచుకుంటూనే మరోవైపు ఏ నియోజక వర్గానికి సంబంధించి అక్కడే ఏ సమయంలోనైనా వాలిపోవడం స్థానిక అవసరాలకు అనుగుణంగా స్పందించడం, తక్షణ చర్యలకు దిగడం వంటి పరిణామాలు అన్ని కూటమి అభ్యర్థి మహేష్ ప్రచారంలో పై చేయి సాధించటానికి కారణమయ్యాయి. ముక్కుసూటిగా, ఉన్నది ఉన్నట్లుగా ప్రజలకు భరోసా ఇవ్వడమే కాకుండా ప్రత్యర్థి పార్టీ వైసీపీ సవాళ్లను, ఆరోపణలను దీటుగా తిప్పికొట్టడం నియోజకవర్గాలు అన్నింటిలోనూ ప్రచారంలో ఆయనకు పూర్తిగా కలిసివచ్చింది. ఇదే స్పీడుతో పోలింగ్ వరకు దూసుకుపోతానని ఆయన కూటమి ముఖ్యనేతలు అందరికి భరోసా ఇస్తూనే తన స్పీడు అందుకోవాల్సిందిగా విజ్ఞప్తి కూడా చేస్తున్నారు. దీంతో నియోజక వర్గాల్లో కూటమి కేడర్ ఉత్సాహంతో ఉరుకులు వేస్తోంది. నరసాపురంలో బీజేపీ బలపరిచిన లోక్‌సభ అభ్యర్థి శ్రీనివాసవర్మ కూటమి పక్షాన ప్రచారంలో ఇప్పటికే ముందు వరుసలో ఉన్నారు. ఆయా నియోజక వర్గాల్లో అసెంబ్లీ అభ్యర్థులతో కలిసి క్షణం తీరకలేకుండా ప్రచారంలో పాల్గొనడమే కాకుండా కొన్ని నియోజకవర్గాల్లో తన ప్రసంగాల్లో దూకుడుగా వ్యవహరిస్తున్నారు. ఇదంతా కూటమి కేడర్‌లో జోస్ పెంచినట్టు అయింది. కూటమి మేనిఫెస్టోతో పాటు తనకు ఉన్న అనుభవం, స్థానిక సమస్యలపై అవగాహన, ప్రచారంలో స్థానికులను కలుసుకోవడం, తగినన్ని వాగ్దానాలు ఇవ్వడం ద్వారా ప్రజలకు మరింత చేరువ కాగలిగారు. ప్రచారపర్వంలో ఇప్పటికే పలు ప్రాంతాల్లో ప్రజలను కలుసుకోగలిగారు. దీంతో అధికార వైసీపీకి అక్కడ గట్టిపోటీ ఇచ్చేలా వ్యూహం అమలు చేయగలిగారు.

సైకిల్ అభ్యర్థుల జోరు

ఏలూరు, నరసాపురం లోక్‌సభ స్థానాల పరిధిలో ఎమ్మెల్యే అభ్యర్థులుగా ఉన్న టీడీపీ పక్షాన పోటీ పడుతున్న వారంతా ఇప్పటికే మండుటెండల్లోనే ప్రచారంలో దూసుకువెళుతూ వచ్చారు. ఈ మధ్యనే కూటమి పక్షాన విడుదలైన మేనిఫెస్టో వీరిలో మరింత జోష్ పెంచింది. ఏలూరులో బడేటి చంటి, దెందులూరులో చింతమనేని ప్రభాకర్, చింతలపూడిలో సొంగా రోషన్, పాలకొల్లులో నిమ్మల రామానాయుడు, నూజివీడులో కొలుసుపార్థసారథి, ఆచంటలో పితాని సత్యనారాయణ, ఉండిలో రఘురామకృష్ణంరాజు, తణుకులో ఆరిమిల్లి రాధాకృష్ణ ఇప్పటికే ప్రచారంలో అధికారపక్షానికి మించి దూసుకుపోయారు. మరేపార్టీకి అందనంత వేగంగా ముందుకు సాగారు. ఉండిలో ఫైర్‌బ్రాండ్ రఘురామకృష్ణంరాజు క్షణం తీరికలేకుండా ప్రచారంలో ప్రజల మధ్య ఉంటున్నారు. ఆయనకు వాడవాడలా జనం మద్దతు లభిస్తుండటంతో కూటమి నేతలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇంకోవైపు పార్టీలో సీనియర్, పొలిట్‌బ్యూరో సభ్యుడు పితాని సత్యనారాయణ ఈ మధ్యకాలంలో ప్రచార దూకుడిని పెంచి ప్రత్యర్థిని తికమక పెడుతున్నారు. పాలకొల్లులో నువ్వానేనా అన్నట్టుగా నిమ్మలరామానాయుడు నిత్యం జనంతో మమేకం అవుతూనే ఆఖరికి సైకిల్‌మీద ప్రచారంలో పాల్గొనడం అందరిని ఆకర్షిస్తోంది. తణుకులో ఆరిమిల్లి రాధాకృష్ణ సరికొత్త, వినూత్న ప్రచారంలో ఎవరికి తీసిపోకుండా తణుకు బరిలో ఉన్న వైసీపీ అభ్యర్థి, మంత్రి కారుమూరి నాగేశ్వరరావుకు కొత్త సవాళ్ళు విసురుతున్నారు.

అన్నిచోట్ల జనసేన క్రేజ్

పొత్తులో భాగంగా ఉంగుటూరు, పోలవరం, భీమవరం, తాడేపల్లిగూడెం, నరసాపురం నియోజక వర్గాల నుంచి జనసేన అభ్యర్థులు పోటీలో ఉన్నారు. వీరంతా ప్రచారంలోనూ ప్రజలకు దగ్గరకావడంలోనూ వాగ్దానాలను సమర్థవంతంగా వివరించడంలోనూ ఇప్పటికే ఆయా నియోజకవర్గాల్లో పై చేయి సాధించారు. పోలింగ్‌కు సమయం దగ్గరపడటంతో నిద్రాహారాలు మానిమరీ ప్రచారాన్ని గరిష్ఠస్థాయికి తీసుకెళ్లగలిగారు. జనసేన అభ్యర్థులు పులపర్తి రామాంజనేయులు, బొలిశెట్టి శ్రీనివాస్, బొమ్మిడి నాయకర్, పత్సమట్ల ధర్మరాజు, చిర్రి బాలరాజు తమకు ఉన్న పరిధిలో ఎన్నికల ప్రచారంలో వినూత్నంగా వ్యవహరిస్తున్నారు. ఎక్కడ చూసినా జనసేనాని పవన్ పంచ్‌డైలాగులు, మేనిఫెస్టో పోరే వినిపిస్తోంది. కూటమి పక్షాన జనసేన పోటీ చేస్తున్న నియోజకవర్గాలు అన్నింటిలోనూ టీడీపీ, బీజేపీ పూర్తిగా కలిసిరావడం వీరి ప్రచారంలో జోష్ పెంచింది. దీంతో గెలుపు తమదే అనే విధంగా దూసుకెళ్లుతున్నారు.

కైకలూరులో కామినేని

కైకలూరు నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ గడిచిన కొన్నాళ్ళ నుంచి చేస్తున్న ప్రచారం ఇప్పుడు మరింత జోరు పెంచేశారు. వయోభారాన్ని లెక్క చేయకుండా మండుటెండను తట్టుకుని ఆయన కైకలూరులో దూసుకువెళ్ళటం మిగతా పార్టీలు సైతం నివ్వెరపోయేలా చేస్తోంది. ప్రచారంలో ప్రజలకు చేరువ కావడంలోనూ, కూటమి పక్షాన ఇప్పటిదాకా ఆయనదే పై చేయిగా కనిపిస్తోంది. ఎన్నికల కమిషన్ నియమావళి ప్రకారం ప్రచారం చేస్తూనే ఇంకోవైపు అన్నివర్గాలను ఆకర్షించేలా తనదైనశైలిలో ఇన్నాళ్ళు ప్రచారం చేయడమే కాకుండా రానున్న కొద్దిరోజుల్లోనూ వేలాదిమంది తనకు చేరువ అయ్యేలా ప్రచారం వ్యూహాన్ని అమలు చేయబోతున్నారు. దీంతో పాటు జనసేన, తెలుగుదేశం ఉమ్మడిగా తనతో పాటు ప్రయాణిస్తూ ఉండడంతో కామినేని ప్రచారాన్ని హోరెత్తించేశారు.


ఉంగుటూరు ప్రచార ర్యాలీలో జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు

ఎన్నికల్లో ప్రలోభాలు నియంత్రించండి

- సీజర్ బృందాల తనిఖీలు ముమ్మరం చేయాలి
- రాత్రి పూట నిఘా ఇంకా పెరగాలి
- జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు సిటీ, మే 7 : జిల్లాలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపరిచే చర్యలను నియంత్రించడంలో భాగంగా ఎస్‌ఎస్‌టి, ఎఫ్‌ఎస్‌టి బృందాల తనిఖీలు మరింత ముమ్మరం చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి ప్రశాంత వాతావరణంలో నైతిక పరమైన ఎన్నికల నిర్వహణ, ఎన్నికల సామాగ్రి పంపిణీ, ఎన్నికల సిబ్బంది విధుల కేటాయింపుపై జిల్లాలోని ఆర్వోలు, ఎన్నికల నిఘా బృందాల అధికారులతో కలెక్టర్ జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నైతిక పరమైన ఎన్నికల నిర్వహణకు ప్రతి అధికారి కృషి చేయాలన్నారు. ఎన్నికల పోలింగ్ దగ్గర పడుతున్న దృష్ట్యా నగదు, మద్యం వంటివి చలామణీ కాకుండా చర్యలను తీసుకోవాలని , సంబంధిత ఆర్వోలు , ఆయా నిఘా బృందాల పనితీరును రాత్రి పూట పరిశీలించాలన్నారు. జిల్లాలోని సీజర్స్ బృందాలు తమ నిఘాని మరింతగా చేయాలని, ముఖ్యంగా రాత్రి సమయాల్లో పంపిణీ ఉండే అవకాశం ఉన్నందున ప్రలోభాలు అందించే అవకాశం ఉన్న ప్రదేశాలను ముందుగానే గుర్తించి ఆయా ప్రదేశాలపై నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల సిబ్బందికి ఈవీఎం మిషన్ యూనిట్లు , వీవీప్యాట్‌లు ఇతర సామగ్రిని ఎన్నికల సిబ్బందికి అందించేందుకు, వాహనాల ఏర్పాట్లపై ప్రతి రిటర్నింగ్ అధికారి పటిష్ఠ ప్రణాళిక రూపొందించు కోవాలన్నారు. ఆర్‌ఓ టేబుల్, ఎన్నికల సామాగ్రి పంపిణీ కౌంటర్, హెల్ప్ డెస్క్, పార్కింగ్‌ల వద్ద పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ఏర్పాటు చేయాలన్నారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వద్ద ఎన్నికల సామాగ్రి పంపిణీకి ఎక్కువ కౌంటర్లు ఏర్పాటు చేసుకుని ఎటువంటి గందరగోళ పరిస్థితులు లేకుండా ఆర్వోలు చర్యలు తీసుకోవాలన్నారు. డిస్ట్రిబ్యూషన్ రోజున ఉదయం 6.30 గంటల కల్లా అన్ని ఏర్పాట్లను పూర్తి చేసుకోవాలన్నారు. డిస్ట్రిబ్యూషన్ కు ముందురోజే ఎన్నికల సామగ్రిని సిద్ధం చేసుకోవాలన్నారు. జిల్లాలో ఇంకా మిగిలి ఉన్న ఓటర్ల స్లిప్‌ల పంపిణీ బుధవారం నాటికి పూర్తి చేయాలన్నారు. డీఆర్వో పుష్పమణి , తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

● సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రం, పోలింగ్ కేంద్రాల నిర్వహణకు ప్రణాళికా బద్ధంగా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో సంబంధిత ఏర్పాట్లపై అధికారులు, కలెక్టరేట్ సిబ్బందితో ఆయన ప్రత్యేకంగా సమీక్షించారు. ఈనెల 13న జరిగే ఎన్నికల నిర్వహణపై, ఈనెల 12న ఏర్పాటు చేసే డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాల్లో ఏర్పాట్లను అంశాల వారీగా కలెక్టర్ సమీక్షించారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి : ఎస్పీ

లింగపాలెం, మే 7 : ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని వాటిపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి అన్నారు. లింగపాలెం మండలంలో ఎస్పీ మేరీ ప్రశాంతి పోలింగ్‌కేంద్రాలను పరిశీలించారు. సమస్యాత్మక గ్రామమైన ధర్మాజీగూడెం ఎంపీయూపీ స్కూల్లో ఉన్న ఓ పోలింగ్ కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఎన్నికల సమయంలో తీసుకోవాల్సిన భద్రత ఏర్పాట్లు, ఓటర్లకు కావాల్సిన మౌలిక సదుపాయాలను పరిశీలించారు. అనంతరం ధర్మాజీగూడెంలోని పోలీస్‌స్టేషన్‌లో అధికారులతో సమావేశమయ్యారు. నూజివీడు స్పెషల్‌బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరరావు, ఎస్సై పి.చెన్నారావు, పలువురు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

పొత్తు..కత్తి

ఇతర పార్టీలతో కలిసి టీడీపీ ముందుకు..
ఆ దిశగానే రాజకీయ వ్యూహాలు

కొన్నిసార్లు సక్సెస్..మరి కొన్నిసార్లు ఫెయిల్

-7లో


ముసునూరు పోలీస్‌స్టేషన్ వద్ద ప్రధాన రహదారిలో నిలిచిన వర్షపు నీరు


ఆరుగొలనుపేటలో నేలరాలిన మామిడి కాయలు

ఈదురు గాలులు.. భారీ వర్షం

- నేలరాలిన మామిడి.. నేలకొరిగిన అరటితోటలు
- విరిగిపడిన విద్యుత్ స్తంభాలు
- ఏజెన్సీలో ఉరుములు, మెరుపులతో భారీ వర్షం
- నిలిచిన విద్యుత్, అంధకారంలో ఏజెన్సీ గ్రామాలు
- పిడుగుపాటుకు ఇద్దరి మృతి

ఏలూరు సిటీ/బుట్టాయగూడెం/ద్వారకా తిరుమల/లింగపాలెం, మే 7 : భారీగా ఈదురు గాలులు....ఉరుములు, పిడుగులతో కూడిన వర్షంతో జిల్లాలో జనజీవనం స్తంభించింది. మంగళవారం పగలు 43 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకు ఉష్ణోగ్రతలు నమోదు కాగా మధ్యాహ్నం 3 గంటల నుంచి ఈదురుగాలులుతో కూడిన భారీ వర్షం కురవడంతో వాతావరణం ఒక్క సారిగా చల్లబడింది. వాతావరణ మార్పులు కారణంగా, ద్రోణి ప్రభావంతో మంగళవారం వర్షాలు కురుస్తాయని ఇప్పటికే వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. దానికి తగ్గట్టుగానే జిల్లాలో భారీ వర్షాలు కురిశాయి. ఏలూరు నగరంలో భారీగా కురిసిన వర్షానికి రహదారులపై నీరు ఉధృతంగా ప్రవహించింది. జిల్లాలోని అనేక ప్రాంతాలలో ఇదే పరిస్థితి కనిపించింది. రబీ వరి సాగు చివరి దశలో ఉండడం, ఇంకా కొన్ని ప్రాంతాల్లో మాసూళ్లు పూర్తి కాకపోవడంతో చేతికొచ్చిన వరి పంట వర్షం నీటి పాలైంది. పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలో బలమైన ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన భారీవర్షం కురిసింది. ఈదురు గాలులకు పలుచోట్ల విద్యుత్ స్తంభాలు విరిగిపోగా వైర్లు తెగిపోయాయి. కోటనాగవరంలో ఇళ్ల మధ్యలో ఉన్న కొబ్బరి చెట్లు విరిగి పడి విద్యుత్ వైర్లు తెగిపోయాయి. కరెంట్ లేక ఏజెన్సీ గ్రామాల్లో అంధకారం నెలకొంది. 11 కేవీ లైన్లు కూడా దెబ్బతినడంతో విద్యుత్ అధికారులు, సిబ్బంది విద్యుత్‌ను పునరుద్ధరించే పనుల్లో నిమగ్న మయ్యారు. ద్వారకా తిరుమల చినవెంకన్న క్షేత్రంపై దాదాపు రెండుగంటల పాటు ఎడతెరపిలేని వర్షం కురవడంతో క్షేత్రపరిసరాలు జలమయమయ్యాయి. శ్రీవారి ప్రధాన రాజగోపుర మెట్ల దారిలో వర్షపునీరు ఉరకలెత్తింది.


కోటనాగవరంలో విరిగిపడిన కొబ్బరి చెట్లు, తెగిపోయిన విద్యుత్ వైర్లు


పైడిపాక చంద్రన్న కాలనీలో పిడుగుపడి దగ్ధమవుతున్న కొబ్బరి చెట్టు


జీలుగుమిల్లిలో నేలకు ఒరిగిన అరటి తోట


ద్వారకా తిరుమల మెట్లదారిపై వర్షపునీటి ఉధృతి

పిడుగుపాటుకు ఇద్దరి మృతి


పరసా రామారావు (ఫైల్)


నాగేశ్వరరావు మృతదేహం

లింగపాలెం మండలం యడవల్లికి చెందిన పరసా రామారావు (45) అనే వ్యక్తి పశువులు మేపేందుకు పొలంలోకి వెళ్లగా అకస్మాత్తుగా వర్షంతో పాటు పిడుగు పడడంతో ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. అతనితో పాటు రెండు గేదెలు మృత్యువాత పడ్డాయి. పశువుల కాపరులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో వారు రామారావును లింగపాలెం ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చింతలపూడి ప్రభుత్వాస్పత్రికి తరలించినట్టు ఎస్‌ఐ పి.చెన్నారావు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ పి.చెన్నారావు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడు ఉన్నారు. జంగారెడ్డిగూడెం మండలం తాడువాయి ప్రాజెక్టు వద్ద జొన్నవారిగూడెం కాలనీకి చెందిన మేకల కాపరి కరిపోలు నాగేశ్వరరావు (55) మేకలు కాస్తుండగా పిడుగు పడి మృతి చెందాడు.


పోస్టల్ బ్యాలెట్ ఓటు వేస్తున్న ఎస్పీ మేరీ ప్రశాంతి

మూడు రోజుల్లో పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ 13,103

ఏలూరు సిటీ/ఏలూరు క్రైం/ఉంగుటూరు, మే 7: జిల్లాలో మూడు రోజులుగా జరుగుతున్న పోస్టల్ బ్యాలెట్ పోలింగ్‌లో మొత్తం 13,103 పోస్టల్ బ్యాలెట్‌లు నమోదయ్యాయి. ఇందులో ఏలూరు జిల్లాకు సంబంధించి పోలైన ఓట్లు 6,983, ఇతర జిల్లాలకు సంబంధించి 2,171, అత్యవసర సర్వీస్ సిబ్బందికి సంబంధించి 1,831, మైక్రో పరిశీలకులకు సంబంధించి 258 , ఇతరులకు సంబంధించి పోలైన ఓట్లు 1,860 వరకు ఉన్నాయి. కాగా ఏలూరులో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ కేంద్రం వద్దకు ఎస్పీ మేరీ ప్రశాంతి మంగళవారం వెళ్ళి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రతి ఒక్కరికి భారత రాజ్యాంగం ద్వారా కల్పించబడిన తమ అమూల్యమైన ఓటును సద్వినియోగించుకోవాలని సూచించారు. ఉంగుటూరు మండల తహసీల్దార్ కార్యాలయంలోని ఫెసిలిటేషన్ సెంటర్‌లో మంగళవారం 167 మంది ఉద్యోగులు తమ పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో 1,569 మంది ఇప్పటి వరకు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నారని ఆర్వో ఖాజావలి తెలిపారు.

కొల్లేరును తవ్వేస్తున్నారు..

- దేవర గోపవరంలో వైసీపీ యువనేత ఆధ్వర్యంలో బరి తెగింపు
- కాంటూరు వ్యవసాయ భూమి ఐదెకరాల్లో తవ్వకం
- చుట్టుపక్కల రైతుల ఫిర్యాదుతో అటవీ శాఖ కేసు నమోదు
- రెండు ఎక్స్‌కవేటర్లు, రెండు ట్రాలీలు సీజ్ .. 8 మందిపై కేసు


దేవర గోపవరలో నిషేధిత కొల్లేరు భూముల్లో వేసిన గట్టు

ఏలూరు, మే 7 : వైసీపీ నేతల ఆగడాలకు అంతే లేకుండా పోతోంది. ఓ పక్క అధికారులందరూ ఎన్నికల హడావిడిలో ఉండగా గుట్టుచప్పుడు కాకుండా తమ పని కానిచ్చేసుకోవచ్చని భావించి కాంటూరు వ్యవసాయ భూమి తవ్వకానికి రంగం సిద్ధం చేశారు. వ్యవసాయ పొలం సరిహద్దు రైతులు రాత్రి పూట మిషన్లు వెళ్లడం చూసి ఆరా తీయగా కాంటూరులో చెరువులు తవ్వుతున్నారని తెలిసి అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. నిడమర్రు అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్ పి.గంగారత్నం తెలిపిన వివరాలివి.. నిడమర్రు మండలం దేవర గోపవరానికికి చెందిన కందుపాటి వీరవెంకట మహేష్‌కు చెందిన కొల్లేరు 5వ కాంటూరు పరిధిలోని ఆర్.ఎస్.నెం. 311 , 31 /2లలో గల ఎ.5.54 సెంట్ల భూమిలో సోమవారం రాత్రి రెండు ఎక్స్‌కవే టర్లతో వ్యవసాయ పొలంను చేపల చెరువుగా మార్చేందుకు గట్లు వేస్తుండగా సమాచారం అందిన అటవీ సిబ్బంది దాడి చేసి కేసు నమోదు చేశారు. ఈ ఘటనలో అటవీ చట్టం 1952 ఉల్లంఘనగా నిషేధిత కొల్లేరు భూము లలో చేపల చెరువులు తవ్వుతున్నందుకు కేసు నమోదు చేశామన్నారు. రెండు ఎక్స్‌కేటర్లు, రెండు ట్రాక్టర్లు సీజ్ చేశామని, ఎ-1గా కాకరాల పల్లయ్య, ఎ-2 గా కందులపాటి వీరవెంకట మహేష్‌లతో పాటు మరో ఆరుగురిపై కేసు నమోదు చేశామని ఆమె తెలిపారు.

జిల్లాలో పెద్ద పారిశ్రామిక వాడ తణుకు. రాష్ట్ర రాజకీయాలను ప్రత్యక్షంగా, పరోక్షంగా శాసించిన నాయకులను తణుకు నియోకవర్గం అందించింది. ప్రతి ఎన్నిక ఇక్కడ ప్రతిష్టాత్మకం. ఈసారి తణుకు నియోజకవర్గంలో పోరు రసవత్తరంగా మారింది. తెలుగుదేశం కూటమి, అధికార పార్టీ వైసీపీ మధ్య ప్రధాన పోటీ నెలకొంది. అధికార పార్టీ నుంచి మంత్రి పాతినిధ్యం వహిస్తున్నా ఎన్నికల్లో ఫ్యాన్‌కు ఎదురుగాలి వీస్తోంది. ప్రధానంగా అవినీతి ఆరోపణలు వైసీపీకి విజయావకాశాలను ప్రభావితం చేయనున్నాయి. తెలుగుదేశం పార్టీ, జనసేన, కూటమి ఐక్యంగా కదలడం అధికార పార్టీ పీఠం కదిలే పరిస్థితి నెలకొంది. ఇద్దరు అభ్యర్థుల తరపున కుటుంబ సభ్యులు కూడా ప్రచారంలో నిమగ్నమయ్యారు. ప్రచారాలతో నియోజకవర్గం హోరెత్తుతోంది.

- తణుకు

తణుకు ఫ్యాన్‌కు ఎదురుగాలి



• జోరందుకున్న సైకిల్ • టీడీపీకి కలిసొచ్చిన జనసేన క్యాడర్ • అసంతృప్తులతో వైసీపీ సతమతం

ఆరిమిల్లి రాధాకృష్ణ, తెలుగుదేశం పార్టీ కూటమి



బలం
- కూటమి ఐక్యత.
- టీడీపీ ఎమ్మెల్యేగా చేసిన అభివృద్ధి
- జనసేన తోడు
- వివాదరహితుడిగా గుర్తింపు

బలహీనత
- రాజకీయాల్లో ఏ ఒక్కరినీ కాదనలేని పరిస్థితి.
- ఏమి చెప్పినా వినడమే తప్ప ఖండించలేరు.

తణుకు నియోజకవర్గంలో కూటమి తరపున టీడీపీ అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ బరిలో ఉన్నారు. వైసీపీ నుంచి మంత్రి కారుమూరి నాగేశ్వరరావు తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో 13 అభ్యర్థులు తణుకు నియోజకవర్గంలో పోటీ పడుతున్నారు. తెలుగుదేశం కూటమి, వైసీపీ మధ్య ప్రధాన పోరు సాగుతోంది. గడచిన ఎన్నికల్లో చావుతప్పి కన్నులొట్టపోయినట్టు వైసీపీ స్వల్ప ఆధిక్యతతో గట్టెక్కింది. ఈ సారి నియోజకవర్గంలో పూర్తిగా ఎదురీదుతోంది.

వైసీపీని వెంటాడుతున్న అవినీతి

తణుకు నియోజకవర్గంలో అధికార పార్టీ వైసీపీని అవినీతి వెంటాడుతోంది. గడచిన ఐదేళ్లలో టీడీఆర్ కుంభకోణం, భవనాలు నిర్మిస్తే కమీషన్‌లు, వెంచర్‌లు వేస్తే కమీషన్‌లు వంటివి ప్రస్తుత ఎన్నికల్లో తీవ్ర ప్రభావాన్నే చూపుతున్నాయి. ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా లేకపోవడం కూడా వైసీపీ అభ్యర్థి కారుమూరిపై ప్రభావం చూపుతోంది. పౌర సరఫరాల శాఖ మంత్రి అయి ఉండి కూడా జిల్లాలో రైతులు ఇబ్బందులు పడ్డారన్న ముద్ర కారుమూరిపై పడింది. వైసీపీపై రైతుల్లోనూ వ్యతిరేకత చోటు చేసుకుంది. మరోవైపు తణుకు నియోజకవర్గం గడచిన ఐదేళ్లలో అభివృద్ధికి నోచుకోలేదు. ప్రాజెక్టులన్నీ పెండింగ్‌లో ఉండిపోయాయి. ఇవన్నీ మంత్రి కారుమూరికి వ్యతిరేక ప్రభావం చూపుతున్నాయి.

వైసీపీకి కేడర్ దూరం

వైసీపీకి క్రియాశీల నాయకులు దూరం కావడం ఎన్నికల్లో ప్రభావం చూపుతోంది. ఏఎంసీ మాజీ చైర్మన్, పీటీఆర్, మట్టా వెంకటేశ్వరరావు వంటి నాయకులు పార్టీకి దూరమయ్యారు. పట్టణంలో క్రియాశీలంగా ఉన్న మరో నాయకుడు కారుమూరికి దూరమయ్యారు. గ్రామాల్లో పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, నాయకులు వైసీపీని వీడి తెలుగుదేశంలో చేరారు.



తణుకు నియోజకవర్గం : తణుకు, ఇరగవరం, అత్తిలి
మొత్తం ఓటర్లు : 2,34,575
పురుషులు : 1,14,435 స్త్రీలు : 1,20,135 ఇతరులు: 5

పోటీలో ఉన్న అభ్యర్థులు

1.కారుమూరి నాగేశ్వరరావు	వైసీపీ	సీలింగ్ ఫ్యాన్
2.ఆరిమిల్లి రాధాకృష్ణ	టీడీపీ	సైకిల్
3.మురళీకృష్ణ సజ్జా	స్వతంత్ర	డిష్ యాంటీనా
4.కుమారి పుప్పాల	స్వతంత్ర	క్యాలిక్యులేటర్
5.కడలి రామారావు	కాంగ్రెస్	హస్తం
6.ఆకుమర్తి ధనుంజయ	బీఎస్పీ	ఏనుగు
7.మామిడిశెట్టి మోహన్	స్వతంత్ర	స్టూల్
8.కోడూరి మోహర్ చైతన్య	స్వతంత్ర	కరెంట్ స్తంభం
9.రాపేటి రమణబాబు	స్వతంత్ర	బకెట్
10.సాకా సురేష్	జైభీమ్‌రావ్ పార్టీ	కోటు
11.కరుటూరి సుబ్బారావు	స్వతంత్ర	గాజు గ్లాసు
12.చిట్టూరి సత్యనారాయణ	స్వతంత్ర	వాల్‌హుక్
13.రామచంద్రరావు కుసంపూడి	స్వతంత్ర	చెత్తబుట్ట

ఇంకొందరు బీజేపీ పక్షాన చేరారు. మరోవైపు కారుమూరికి అసంతృప్తుల బెడద పెద్ద తలనొప్పిగా మారింది. కార్యకర్తలను దూషించడం వంటి చర్యలతో పార్టీ శ్రేణులు దూరమయ్యాయి. దాంతో నియోజకవర్గంలో ప్రణాళికలు వేసి ఎన్నికల్లో నిర్వహించే ముఖ్య నాయకులు అండ కారుమూరికి కరువైంది. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలనే ప్రచారంలో చెప్పుకొంటున్నారు. జగన్ పేదల పక్షపాతి అంటూ

కారుమూరి వెంకట నాగేశ్వరరావు, వైసీపీ



బలం
- వైసీపీ ఓటు బ్యాంకు
- ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ధీమా
- అందరితోను చనువు

బలహీనత
- అవినీతి విమర్శలు
- నచ్చని కార్యకర్తలపై దూషణ.
- ముఖ్య నాయకులను దూరం చేసుకోవడం
- అభివృద్ధి లేమి.

ప్రచారంలో పదే పదే వివరిస్తున్నారు. అంతే తప్ప నియోజకవర్గంలో అభివృద్ధి ఊసెత్తడంలేదు. భవిష్యత్‌లో నియోజకవర్గానికి ఏమి చేస్తామో చెప్పలేని పరిస్థితిలో మంత్రి కారుమూరి ఇబ్బందులు పడుతున్నారు.

టీడీపీ కూటమిలో ఐక్యత

టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఉమ్మడి అభ్యర్థిగా తెలుగుదేశం నుంచి పోటీ చేస్తున్న ఆరిమిల్లి రాధాకృష్ణకు అనేక అంశాలు కలసి వస్తున్నాయి. 2014లో ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆరిమిల్లి గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు వేశారు. మౌలిక వసతులు కల్పించారు. పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. అప్పట్లో చేసిన అభివృద్ధి తాజా ఎన్నికల్లో ఆరిమిల్లికి కలసి వస్తోంది. గత ఎన్నికల్లో సల్ప ఓట్లతో ఓటమి చవిచూశారు. అప్పటి నుంచి ప్రజల్లో ఉన్నారు. గత ఎన్నికల్లో జనసేన విడిగా పోటీ చేసింది. తణుకు నియోజకవర్గం నుంచి దాదాపు 30వేలకు పైగా ఓట్లు జనసేన ఖాతాలో వేసుకుంది. ఇప్పుడు జనసేన తెలుగుదేశం పార్టీకి అండగా నిలచింది. జనసేన ఇన్‌చార్జి కినుక వహించినా పార్టీ కార్యకర్తలు, నాయకులంతా ఆరిమిల్లికి వెన్నుదన్నుగా ఉంటున్నారు. పవన్ మాటే తమ మాట అంటూ జనసేన శ్రేణులు అంతా కూటమికి అండగా నిలబడ్డారు. ఇటీవల చంద్రబాబు, పవన్ కల్యాణ్ తణుకులో నిర్వహించిన సభ సూపర్ సక్సెస్ అయ్యింది. జనసేనకు టిక్కెట్ ఇవ్వకుండా ఎందుకు తగ్గాల్సి వచ్చిందో ఆ సభలో పవన్ కల్యాణ్ వివరించారు. ఎక్కడా నెగ్గాలో కాదు. ఎక్కడ తగ్గాలో తెలిసిన వాడే నాయకుడు. మీ కోసమే తగ్గానంటూ ఆ సభలో పవన్ కల్యాణ్ అందరినీ ఒప్పించారు. మెప్పించారు. ఆ తర్వాత తణుకులో రాజకీయ సమీకరణలు మరింత వేగం పుంజుకున్నాయి. తెలుగదేశం, జనసేన, బీజేపీ శ్రేణులంతా ఏకతాటిపై నడుస్తున్నారు. ఆరిమిల్లికి మద్దతుగా ఉన్నారు. ఇదే ఇప్పుడు తణుకులో కూటమికి కలసి వస్తోంది. జనసేన, బీజేపీలకు ఆరిమిల్లి ప్రాధాన్యత ఇస్తున్నారు.

దెందులూరులో సార్వత్రిక పోరులో ఉత్కంఠ నెలకొంది. ప్రధాన పార్టీల అభ్యర్థులు పోటాపోటీగా ప్రచారం చేస్తున్నారు. ప్రధాన పార్టీలైన టీడీపీ, వైసీపీ గెలుపుపై ధీమాతో ముందుకెళ్తుండగా, మధ్యలో కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి నేనున్నానంటూ ప్రచారంలో ముందుకు వచ్చారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన అనుభవశాలి చింతమనేని ప్రభాకర్ నాలుగోసారి ఎన్నికల బరిలో దిగారు. వైసీపీ అభ్యర్థిగా ప్రస్తుత ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి రెండో సారి తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి ఆలపాటి నరసింహమూర్తి తొలిసారి బరిలో దిగారు. - పెదవేగి

దెందులూరు ఉత్కంఠ పోరు

• టీడీపీ.. వైసీపీ హోరాహోరీ • ఇద్దరి మధ్య కాంగ్రెస్ పార్టీ





దెందులూరు నియోజకవర్గం
మండలాలు : దెందులూరు, పెదవేగి, పెదపాడు, ఏలూరు రూరల్
పార్లమెంట్ నియోజకవర్గం : ఏలూరు
మొత్తం ఓటర్లు : 2,23,777
పురుషులు : 1,09,465 మహిళలు : 1,14,305
ఇతరులు : 7

పోటీలో ఉన్న అభ్యర్థులు

1. కొఠారు అబ్బయ్యచౌదరి	వైసీపీ
2. ఆలపాటి నరసింహమూర్తి	కాంగ్రెస్
3. చింతమనేని ప్రభాకర్	టీడీపీ
4. నేతల రమేష్‌బాబు	బీఎస్పీ
5. చిలుకూరి ప్రభాకరరావు	జాతీయ జనసేన
6. ఆముదాలపల్లి ప్రసాద్	పిరమిడ్ పార్టీ
7. ఎ.అశోక్‌చౌదరి	స్వతంత్ర
8. అలగా రవికుమార్	స్వతంత్ర
9. కొనకళ్ల శ్రీనివాసరావు	స్వతంత్ర
10. చెరుకూరి శ్రీరామమూర్తి	స్వతంత్ర
11. శివరామ వరప్రసాద్ పెరిశెట్టి	స్వతంత్ర
12. నూతి నాగరాజు	స్వతంత్ర
13. నూతి రవీంద్ర	స్వతంత్ర
14. పచ్చిగోళ్ళ జాన్ ధర్మరాజు	స్వతంత్ర
15. పల్లి రమేష్	స్వతంత్ర

దెందులూరు నియోజకవర్గం 1955లో ఏర్పాటైంది. తొలి నుంచి కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తూ వచ్చింది. టీడీపీ ఆవిర్భావంతో కాంగ్రెస్ పార్టీకి అడ్డుకట్ట పడింది. టీడీపీ ఆవిర్భావం తర్వాత జరిగిన పది ఎన్నికల్లో ఆరు పర్యాయాలు విజయదుందుభి మోగించింది. ప్రస్తుతం టీడీపీ, జనసేన, బీజేపీ ప్రచారంలో ముందుకు దూసుకుపోతున్నాయి. 2019 ఎన్నికల్లో వైసీపీ విజయం సాధించి మరోసారి విజయం కోసం గట్టి ప్రయత్నం చేస్తోంది. ఇద్దరి మధ్య కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పోటీ దిగడంతో ఎన్నిక ఉత్కంఠభరితంగా మారింది.

ఎంపీపీగా చింతమనేని ప్రస్థానం



పెదవేగి మండల పరిషత్ అధ్యక్షుడిగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన చింతమనేని ప్రభాకర్ భవిష్యత్ రాజకీయాలకు బాట వేసుకున్నారు. 2009లో ఎమ్మెల్యేగా పోటీచేసిన ఆయన తొలి ప్రయత్నంలోనే శాసనసభలో అడుగుపెట్టారు. ప్రతిపక్షంలో ఉన్నా శాసనసభలో దూకుడుగా వ్యవహరించి రాష్ట్రస్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారు. అదే ఒరవడితో 2014లో రెండోసారి ఎమ్మెల్యేగా విభజిత ఆంధ్రప్రదేశ్ శాసనసభలోనూ తన వాణిని వినిపించారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే చింతమనేని సేవా కార్యక్రమాలతో మరింత చేరువయ్యారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అవసరమైన అన్ని రాతపుస్తకాలను ఒకటి నుంచి పదో తరగతివరకు ఆయన ఉచితంగా అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 2009 నుంచి 2019 వరకు పదేళ్లపాటు ఉచిత రాత పుస్తకాలను నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించారు. అదే ప్రభాకర్‌ను చిన్న పిల్లల దగ్గరనుంచి పెద్దవారివరకు 'నా' అనే భావనను తీసుకొచ్చింది. 2019లో ఓటమి అనంతరం అధికారపార్టీ కేసులతో వేధించినా తగ్గకుండా అనుచరులతో కలసి నియోజకవర్గ సమస్యలపై పోరాటం చేశారు. కొద్దినెలల కిందట కొంతమంది ప్రభాకర్‌పై తిరుగుబాటు జెండా ఎగురవేశారు. వెంటనే అసంతృప్తులను సముదాయించి తిరిగి ఒక్కటిగా ఎన్నికలకు వెళ్ళారు.

ప్రభాకర్‌కు మాస్ ఫాలోయింగ్ ఎక్కువ. ఎక్కడకు వెళ్లినా ఎటువంటి బేషజాలు లేకుండా అందరితో ఒక్కటిగా ఉండే మనస్తత్వం ఆయనకు ప్లస్ పాయింట్. పార్టీ బలంతోపాటు సొంతంగా తనకంటూ ఒక వర్గాన్ని ఏర్పాటు చేసుకోవడంతో గ్రామాల్లో ఆయన మరింత పట్టు ఏర్పడింది.

తండ్రి చాటు బిడ్డ అబ్బయ్య చౌదరి



లండన్‌లో వ్యాపార, ఉద్యోగాలలో ఉండే కొఠారు అబ్బయ్యచౌదరి తండ్రి చాటు బిడ్డగా రాజకీయాల్లోకి వచ్చారు. 2019 ఎన్నికలకు కొద్ది నెలల ముందే ఆయన రాజకీయాల్లోకి అడుగు పెట్టారు. తొలి ప్రయత్నంలో విజయాన్నందుకున్న ఆయన అసెంబ్లీలో అడుగు పెట్టారు. అబ్బయ్యచౌదరి రాజకీయంగా నియోజకవర్గానికి కొత్తే అయినా.. ఆయన తండ్రి కొఠారు రామచంద్రరావు సుదీర్ఘ రాజకీయనేత. 2009 ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిగా పోటీచేసి చింతమనేని ప్రభాకర్ చేతిలో ఓటమి పాలయ్యారు. అబ్బయ్యచౌదరి ఐటీ కంపెనీలను తీసుకొచ్చి యువతకు ఉపాధి కల్పిస్తామని చెప్పినా అమలు చేయలేదు. పార్టీలో ద్వితీయశ్రేణి నాయకత్వంపై సరైన పట్టులేదు. కొంతమంది ఆయనకు వ్యతిరేకంగా జట్టు కట్టారు. ఆయన తండ్రి పార్టీలో అంతర్గత కలహాలను చక్కదిద్ది ఒక్కతాటిపైకి తీసుకొచ్చారు. అబ్బయ్యచౌదరి ఇసుక, మట్టి మాఫియాను పెంచి పోషించారనే ఆరోపణలు ఎదుర్కొంటున్నారు.

వైసీపీ నుంచి కాంగ్రెస్‌కు మారిన ఆలపాటి



వైసీపీ జిల్లా అధికార ప్రతినిధిగా ఉన్న ఆలపాటి నరసింహమూర్తి ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరిని బాహాటంగా విమ ర్శించారు. ఇసుక, మట్టి మాఫియా, దాడులు, దౌర్జన్యాలపై వైసీపీ అధిష్టానానికి ఫిర్యాదు చేశారు. స్పందన లేకపోవడంతో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆ వెంటనే కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిగా దెందులూరు బరిలో నిలిచారు. వైసీపీలో పాత మిత్రులను కలుసుకుని ఎన్నికల్లో మద్దతు ఇవ్వాలని కోరారు. లోపాయికారీగా తనకే మద్దతిస్తారనే ఆయన ధీమాతో ఉన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఆది నుంచి ఉన్న ఓటు బ్యాంకుతో గెలుపు అవకాశాలు ఉన్నాయని ఆయన ఆశతో ఉన్నారు. ఆలపాటి నరసింహమూర్తి ప్రచారంలో దూసుకెళ్తున్నారు. టీడీపీ, వైసీపీ అభ్యర్థులకంటే ముందునుంచే ప్రచారం చేస్తూ ఓటర్లను ఆకర్షిస్తున్నారు.



ఆచంటలో మాట్లాడుతున్న జేఏసీ ఎన్‌డీఏ కూటమి కాపు నేతలు

రెడ్ల పాలనలో కాపు జాతికి అన్యాయం

టీడీపీ పాలనలోనే న్యాయం : కాపు జేఏసీ నేతలు

ఆచంట, మే 7: రాష్ట్రంలో మొదటి నుంచి రెడ్డి కులస్తుల పాలనలో కాపు జాతికి అన్యాయం చేశారని కాపు జేఏసీ నేతలు, తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వాసురెడ్డి ఏసుదాసు, కాపు జేఏసీ రాష్ట్ర నాయకులు ఆరేటి ప్రకాష్ అన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా జాతి, రాష్ట్ర ప్రజలు కోసం కాపు జేఏసీ తరపున ప్రచారం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఆచంటలోని టీడీపీ కార్యాలయం వద్ద మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జగన్మోహనరెడ్డి పరిపాలనతో రాష్ట్రంలో కాపు జాతికి అన్ని విధాల నష్టం జరిగిందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో కాపు కార్పొరేషన్ లేదని, కాపులతోపాటు ఎస్సీ, ఎస్టీలకు కూడా అన్యాయం జరిగిందన్నారు. గతంలో దళిత ముఖ్యమంత్రి దామోదర సంజీవయ్య కాపులకు రిజర్వేషన్‌ను కల్పిస్తే వైఎస్ రాజశేకరరెడ్డి రిజర్వేషన్ లేకుండా చేశాడని తరువాత చంద్రబాబు రిజర్వేషన్‌లు ఏర్పాటుచేస్తే తరువాత వచ్చిన జగన్మోహనరెడ్డి కాపుల రిజర్వేషన్‌లను తుంగలో తొక్కారని విమర్శించారు. మొదటి నుంచి కాపులకు అన్యాయం చేసింది రెడ్డి పాలకులు కాగా న్యాయం చేసింది మాత్రం చంద్రబాబు అన్నారు. కాపులకు కూటమి ప్రభుత్వంతోనే న్యాయం జరుగుతుందన్నారు. ఎన్నికల్లో కాపు నేతలందరూ కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సమావేశంలో జేఏసీ నేతలు వేమన శ్రీనివాస్, సిద్ధు నూకరాజు, ములగాల శ్రీనివాస్, పోతుల సోమేశ్వరరావు, యర్రగొప్పుల నాగ రాజు, జవ్వాది బాలాజీ, ఎం.నాగ సుబ్బారావు పాల్గొన్నారు.

మంత్రి కొట్టుకు చేదు అనుభవం

అర్హులకు ఇళ్ల స్థలాలు ఇవ్వలేదు..

జగన్నాథపురం ప్రచారంలో నిలదీసిన యువకులు



మంత్రిని నిలదీస్తున్న యువకులు

తాడేపల్లిగూడెం రూరల్, మే 7: మండలంలోని జగన్నాధపురం గ్రామంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వైసీపీ అభ్యర్థి, మంత్రి కొట్టు సత్యనారాయణకు మంగళవారం రాత్రి చేదు అనుభవం ఎదురైంది. ఎన్నికల ప్రచారంలో ప్రసంగిస్తుండగా గ్రామానికి చెందిన కొందరు యువకులు తమకు ఇళ్ల స్థలాలు రాలేదని, వచ్చిన వారికే ఒకే ఇంట్లో రెండు మూడు వచ్చాయని నిలదీశారు. దీంతో కొట్టు మాట్లాడుతూ తాము ఇవ్వలేదంటే చంద్రబాబు మంచోడంటావా అని ప్రశ్నించారు. దీంతో తాము వైఎస్‌ఆర్ పార్టీ అభిమానులమేనని తమకు న్యాయం చేయాలని అడగడం నేరమా అన్నారు. దీంతో అక్కడ ఉన్న స్థానిక నాయకులను ఎవరెవరికి స్థలాలు రాలేదో జాబితా సిద్ధం చేయాలని చెప్పడంతో అక్కడ గొడవ సద్దుమణిగింది.

యథేచ్ఛగా నగదు పంపిణీ..!

కుక్కునూరు, మే 7: కుక్కునూరు మండలంలో ఒక ప్రధాన పార్టీ తమ అభ్యర్థి విజయం కోసం యథేచ్ఛగా డబ్బు పంపిణీ సాగిస్తోంది. ఇప్పటికే చాలా గ్రామాల్లో ఒక్కో ఓటుకు రూ.వెయ్యి చొప్పున పంపిణీ చేసినట్టు సమాచారం. పలు ప్రాంతాలకు చెందిన వ్యక్తుల సమక్షంలో డబ్బు పంపిణీ జరుగుతోందని పలువురు చెబుతున్నారు. ఓటుకు రూ.వెయ్యి చొప్పున ఇస్తూ ఈవీఎం ప్యాట్‌లో గుర్తులు చూపిస్తూ తప్పనిసరిగా ఓటును వేయాలని సూచిస్తున్నారు. ఈ క్రమంలో తమ పార్టీకి అనుకూలంగా ఉన్న వారికి ఓటు వేస్తానని గుర్తించిన వారికి డబ్బు పంపిణీ జరుగుతుంది.

నకిలీ ఓటుకు చెక్

టెండర్ ఓటు



మీ ఓటును వేరొకరు వేశారా.. అయినా ఆందోళన చెందాల్సిన పనిలేదు. ఎన్నికల సంఘం సెక్షన్ 42 ప్రకారం టెండరు ఓటు వేసే హక్కు కల్పించింది. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ ద్వారా కాకుండా పేపర్ బ్యాలెట్ ద్వారా ఓటేసే అవకాశం కల్పిస్తారు. ముందుగా గుర్తింపు కార్డుతో పోలింగ్‌బూత్‌లో ప్రిసైడింగ్ అధికారి వద్దకు వెళ్లాలి. మీరు ఓటు వేయలేదని ముందుగా వారికి చెప్పాలి. మిమ్మల్ని కొన్ని ప్రశ్నలు అడుగుతారు. కొన్ని పత్రాలు కూడా అడగచ్చు. తర్వాత పేపర్ బ్యాలెట్ ద్వారా ఓటు వినియోగించుకునేందుకు అనుమతి పొందవచ్చు. టెండర్ బ్యాలెట్ ఓటర్ల వివరాలను ప్రిసైడింగ్ అధికారులు ఫారం-17లో నమోదు చేస్తారు. ఈ ఫారం 5వ కాలంలో ఓటరు సంతకం లేదా వేలిముద్రను తీసుకున్న తర్వాత వారికి బ్యాలెట్ పేపర్‌ను అందజేస్తారు. ప్రత్యేక ఓటింగ్ కంపార్ట్‌మెంట్‌లో మీరు ఎంచుకున్న అభ్యర్థికి చెందిన ఎన్నికల గుర్తుపై స్వస్తిక్ ముద్రను వేయాలి. ఓటును ఎవరికి వేశారో బయటకు కనబడనివిధంగా బ్యాలెట్ పత్రాన్ని మడచి కంపార్ట్‌మెంట్ బయటకు వచ్చి పీవోకు అందించాలి. బ్యాలెట్ పత్రాన్ని టెండర్ ఓటుగా పీవో మార్క్ చేసి ప్రత్యేక కవర్‌లో వేరుగా ఉంచుతారు. కౌంటింగ్ రోజున లెక్కిస్తారు. ఏదైనా పోలింగ్ బూత్‌లో టెండర్ ఓట్లు 14శాతానికి మించితే ఆ బూత్‌లో రీపోలింగ్ నిర్వహిస్తారు. - ద్వారకా తిరుమల

డమ్మీ ఈవీఎంతో ప్రచారం



డమ్మి ఈవీఎంతో అవగాహన కల్పిస్తున్న కూటమి నాయకులు

పోటీలో ఉన్న అభ్యర్థుల పేరు, ఎన్నికల గుర్తు, వరుస క్రమం తెలియజేస్తూ ఆయా పార్టీల నేతలు నమూనా బ్యాలెట్‌తో ప్రచారం చేసేవారు. ప్రస్తుతం ఈవీఎంలో బటన్ నొక్కుడు గురించి కూడా ఓటర్లకు చెప్పాలి కదా. అందుకే నమూనా బ్యాలెట్‌తో పాటు డమ్మీ ఈవీఎంతో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. కలిదిండి మండలం కొరుకొల్లులో మంగళవారం కూటమి నాయకులు డమ్మి ఈవీఎంలతో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈవీఎంలో కమలం, సైకిల్ గుర్తులను ఓటర్లకు చూపుతూ అవగాహన కల్పించారు. కైకలూరు నియోజకవర్గ కూటమి అభ్యర్థి కామినేని శ్రీనివాస్, ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్‌లను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. బట్టు లీలా కనకదుర్గ, నున్న సుబ్రహ్మణ్యం, వలవల రమేష్, కేశిరెడ్డి బలరామ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు. - కలిదిండి



పాలకొల్లులో ఒక షాపులో ఖాళీగా ర్యాక్‌లు



మందైపోయిందా ?

కొందామన్నా మద్యం దొరక్క మద్యపానప్రియులు విలవిల్లాడి పోతున్నారు. మద్యం షాపులు, మాల్స్‌లో బీర్లు మచ్చుకైనా దొరకడం లేదు. బార్లలో అవసరమైన బ్రాండ్లు లభ్యమవుతున్నప్పటికీ ఫుల్ బాటిల్‌కు రూ.300 నుంచి 500 అదనంగా బాదేస్తున్నారని వాపోతున్నారు. ఎన్నికల వేళ పంపిణీకి అభ్యర్థులు పెద్ద ఎత్తున మద్యం నిల్వలు చేయడంతో ఇప్పుడు కొనుగోలు దారులకు ఈ ఇబ్బంది తలెత్తినట్టు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లాలో అధికార పార్టీకి చెందిన పలువురు అభ్యర్థులు ముందుగానే ప్రభుత్వ మద్యం షాపులు, మాల్స్ నుంచి పెద్ద ఎత్తున కొనుగోలు చేసి నిల్వలు చేసినట్టు తెలుస్తోంది. గతేడాది ఏప్రిల్, మే నెలల్లో ఏమేరకు అమ్మకాలు ఉన్నాయో? ఇప్పుడు అంతే అమ్మాలని సంబంధిత శాఖ ఆదేశాలు ఇవ్వడంతో మద్యానికి కొరత ఏర్పడింది. ప్రభుత్వ మద్యం షాపుల్లో చీప్ లిక్కర్, మీడియం లిక్కరు మాత్రమే అమ్మకాలు జరుగుతున్నాయి. పాలకొల్లులోని ప్రభుత్వ మాల్‌లో మద్యం నిల్వలు లేక షాపు వెలవెలబోతోంది. 2, 3 రకాల స్కాచ్, విస్కీలు మినహా మరే ఇతర రకాలు లేక పోవడంతో మందుబాబులు గగ్గోలు పెడుతున్నారు. మొత్తంగా ఎన్నికలు సమీపిస్తుండటంతో మద్యం కొనుగోళ్లపై పలువురు అభ్యర్థులు ఇతర రాష్ట్రాల వైపు దృష్టి సారిస్తున్నట్టు సమాచారం. ఇప్పటికే ఉంచిన నిల్వలు సరిపోవని అధికార పార్టీ అభ్యర్థులు ఖర్చులు సైతం తగ్గించేసిన నేపథ్యంలో ఎన్నికల సమయానికి తగినంత మద్యం పంపిణీ చేయకపోతే ఆ ప్రభావం ఫలితాలపై పడుతుందని ఆ పార్టీలోని పలువురు నాయకులు ఆందోళన చెందుతున్నట్టు సమాచారం.

- పాలకొల్లు



తాయిలాలపై మార్కెట్ ఆశలు

సాధారణంగా ఎన్నికలు వచ్చాయంటే మార్కెట్‌లో సందడి ఉంటుంది. గెలుపు కోసం పోటాపోటీగా అభ్యర్థులు తాయిలాలు పంచుతుంటారు. పంచాయతీ ఎన్నికల నుంచి జనరల్ ఎన్నికల వరకు ఇది పరిపాటి.ఒక కుటుంబంలో నలుగురైదుగురు సభ్యులు ఉంటే వేలల్లో తాయిలాలు అందుతాయి. ఇలా వచ్చిన మొత్తాన్ని చాలామంది గుర్తుగా ఏదో ఒకటి కొనుగోలు చేస్తుంటారు. మహిళలు చిన్న చిన్న ఆభరణాలు లేదా వెండి వస్తువులు కొంటారు. మరికొందరు దుస్తులు, టీవీ, ఫ్రిజ్, ఏసీ ఇలా ఎలక్ట్రానిక్ వస్తువులు కొనుగోలు చేస్తుంటారు. పోలింగ్ ముగిసిన నాలుగైదు రోజుల వరకు మార్కెట్‌లో సందడి కనిపిస్తుంది. ఈసారి కూడా ఇదే తరహాలో మార్కెట్ ఉంటుందని వ్యాపారులు ఆశలు పెట్టుకున్నారు. దానికి అనుగుణంగా కొందరు ఇప్పటికే పెద్ద మొత్తాల్లో స్టాక్‌ను సిద్ధం చేశారు. అయితే ఎక్కువ వ్యాపారం జ్యూయలరీకే ఉంటుంది. మహిళలు చిన్న చిన్న ఆభరణాలను కొంటారన్న ఉద్దేశంతో కొంత మంది వ్యాపారులు స్టాక్‌ను రెడీ చేస్తున్నారు.

- నరసాపురం

పోలింగ్ ఏజెంట్.. కోవర్టు అయితే !




ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నాటి నుంచి అభ్యర్థులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అంతా పడ్డ కష్టానికి ఆ ఒక్కరోజే ఫలితం ఇవ్వనుంది. ఎన్నికల రోజున పోలింగ్ కేంద్రాల్లో కూర్చుని దొంగ ఓట్లను నివారించే పోలింగ్ ఏజంట్ల చేతిలోనే పోటీలో ఉన్న అభ్యర్థుల భవిత ఉంటుంది. బోగస్ ఓట్లు పడకుండా చూడడం, పోలింగ్ సక్రమంగా జరుగుతుందా లేదా అని గమనించడం పోలింగ్ ఏజెంట్ల బాధ్యత. పోలింగ్ కేంద్రంలో జరుగుతున్న ప్రతీ విషయాన్ని నిశితంగా పరిశీలించి అనుమానం వస్తే అక్కడి అధికారి దృష్టికి తీసుకెళ్లడంలో ఏజెంట్ కీలక పాత్ర పోషించాలి. నమ్మకమున్న వారినే ఏజెంట్లుగా ఎమ్మెల్యే అభ్యర్థులు సెలక్ట్ చేసి అక్కడ ఉంచుతారు. ఒకవేళ ఏజెంట్ ఎదుటి పార్టీకి కోవర్టుగా మారినా, బెదిరింపులకు, డబ్బుకు లొంగినా ఇంతే సంగతులు..

-ద్వారకాతిరుమల

అంతా దగా !





బీసీలను మోసం చేసిన వైసీపీ ప్రభుత్వం

- ఐదేళ్లలో ఆదరణ కరువు
- పంచాయతీ రిజర్వేషన్లలో కోత
- బీసీ కార్పొరేషన్ నిర్వీర్యం
- నిధులూ లేవు..విధులూ లేవు
- ఆయా వర్గాల్లో అసంతృప్తి..

బీసీ ఉపకుల కార్పొరేషన్‌లో పదవి వచ్చిందని ఎంతో సంతోషించాను.ప్రభుత్వం బీసీలకు ఎంతో పెద్ద పీట వేస్తోందని భావించాను. కానీ కార్పొరేషన్‌కు ఒక్క పైసా నిధులు ఇవ్వలేదు. ప్రభుత్వం చివరి దశకు చేరుకుంది. మా పదవి అలంకార ప్రాయంగా మిగిలిపోయింది. వైసీపీ గెలుపుకోసం ఎంతగానో కష్టపడ్డాం నియోజకవర్గాన్ని నెగ్గించాం..చివరకు మాకే ప్రాధాన్యం లేకుండా పోయింది. డైరక్టర్ పదవి అంటే ఏదో ఊహించుకున్నాం.. ఇపుడు చెప్పుకోవాలంటేనే సిగ్గుపడే పరిస్థితి. ఇది జిల్లాలో ఒక కార్పొరేషన్ డైరక్టర్ ఆవేదన.

తెలుగుదేశం హయాంలో మేము సెలూన్ పెట్టుకోవటానికి 2 లక్షల రూపాయలు రుణంగా ఇచ్చారు. ఉపాధి ఏర్పాటు చేసుకున్నాం. ఇప్పటికీ షాపు నిర్వహించుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మా సామాజిక వర్గానికి పెద్దగా ప్రయోజనం లేకుండా పోయింది. షాపు యజమానికి మాత్రమే రూ.10 వేలు ఇస్తున్నారు. అందులో పనిచేసేవారి పరిస్థితి ఏమిటి. ఇది భీమవరంలోని ఒక సెలూన్ షాపు యజమాని ఆందోళన..

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

ముఖ్యమంత్రి జగన్ ప్రతీచోట నా ఎస్సీలు, నా బీసీలు నా మైనారిటీలు అంటూ ఊదరగొడుతున్నారు. వారికి ఎంతో మేలు చేశామంటూ గొప్పలు చెప్పుకుంటున్నారు. బీసీలకు గడచిన ఐదు ఏళ్ళల్లో ప్రభుత్వ పరంగా ఎటువంటి ప్రయోజనం చేకూరలేదు. గతంలో ఉన్న సంక్షేమ పథకాలను ఎత్తివేశారు.బీసీ కార్పొరేషన్‌ను పూరిగా నిర్వీర్యం చేశారు.బీసీ ఉపకులాల పేరుతో 53 కార్పొరేషన్‌లు నెలకొల్పారు. జిల్లాలో సుమారు 30 మందిని చైర్మన్, డైరక్టర్ పదవుల్లో నియమించారు. కానీ కార్పొరేషన్‌లకు పైసానిధులు ఇవ్వలేదు. పదవుల్లో ఉన్న వారికి గౌరవ వేతనం మాత్రం ఇస్తున్నారు.కార్పొరేషన్‌ల వల్ల బీసీ సామాజిక వర్గాలకు పైసా ప్రయోజనం లేకుండా పోయింది.

రుణాలు లేవు



బీసీ కార్పొరేషన్ ద్వారా టీడీపీ ప్రభుత్వం రాయితీ రుణాలు ఇచ్చేది. గరిష్టంగా లక్ష రూపాయలు రాయితీ కల్పించేది. స్వయం ఉపాధి పథకాల్లో 90 శాతం రాయితీ ఇచ్చిన సందర్భాలున్నాయి. దీనివల్ల జిల్లాలో ఎంతో మంది ఉపాధి పొందారు. చిరు వ్యాపారాలు చేసుకున్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీ కార్పొరేషన్ నుంచి ఒక్క రుణం కూడా ఇవ్వలేదు. కార్పొరేషన్‌ను పూర్తిగా నీర్వర్యం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, పెన్షన్ ఇతర పథకాల్లో పొందిన లబ్ధిని బీసీ కార్పొరేషన్ ఖాతాలో వేశారు.గతంలోనూ ఫీజు రీయింబర్స్‌మెంట్, పెన్షన్ పథకాలు అమలు జరిగాయి. స్వయం ఉపాధి కోసం రాయితీ రుణాలు ఇచ్చారు. బీసీ కార్పొరేషన్‌కు ప్రత్యేకంగా నిధులు కేటాయించారు. వైసీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాల ఫలాలను కార్పొరేషన్‌కు అంటగట్టారు. ఆ లెక్కలను చూపుతూ సచివాలయాల్లో బోర్డులను ఏర్పాటు చేశారు. అంతే తప్ప ఉపాధి కల్పించే మార్గం చూపలేకపోయారు. జిల్లాలో బీసీ సామాజిక వర్గానికి చెందిన యువత అంతా రాయితీ రుణాల కోసం ఎదురుచూస్తున్నారు.

ఆదరణ ఏదీ ?



తెలుగు దేశం హయాంలో ఆదరణ పథకాన్ని అమలు చేశారు. బీసీ సామాజిక వర్గాలు చేతి వృత్తులు, హస్త కళలు, వ్యాపారాలకు స్వయం ఉపాధి యూనిట్లు మంజూరు చేశారు. జిల్లాలో వేల మంది లబ్ధి పొందారు. ఆదరణ పథకానికి తెలుగు దేశం ప్రభుత్వం నిధులు వెచ్చించింది. ఉమ్మడి పశ్చిమగోదావరిలో బీసీ కార్పొరేషన్ ద్వారా ఐదేళ్లపాటు దాదాపు 10 వేల కోట్ల రూపాయలు వెచ్చించారు. ఆదరణ పథకంలో పరికరాలు, రాయతీ రుణాలు ఇచ్చారు. సంక్షేమ పథకాలు వేరే నిధులతో అమలు చేశారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆదరణ పథకాన్ని పూర్తిగా రద్దుచేశారు. కార్పొరేషన్ రుణాలకు స్వస్తి పలికారు. స్వయం ఉపాధిని అటక ఎక్కించారు. పలు బీసీ సామాజిక వర్గాలకు భీమా సౌకర్యాన్ని కుదించేశారు. అందులో మత్స్యకారులు, కల్లుగీత కార్మికులు ఉన్నారు. ప్రభుత్వం వీరికి ప్రోత్సాహకాలను నిలిపివేసింది.

సబ్ ప్లాన్ నిధులతో చేసిందేమీ లేదు

బీసీ సబ్‌ప్లాన్ ద్వారా రాష్ట్రంలో రూ.10 వేల కోట్లు వెచ్చించినట్టు జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి సభలోనూ ప్రకటిస్తున్నారు. వృద్ధులకు పెన్షన్, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ , అమ్మఒడి పథకాలకు కేటాయించిన సొమ్ములను సబ్‌ప్లాన్‌లో కలిపేశారు. సబ్‌ప్లాన్ ద్వారా బీసీ వర్గాలకు ప్రత్యేకంగా చేసిందేమీ లేదు. బీసీలకు లెక్కలు మాత్రం చూపించేస్తున్నారు. మరోవైపు 45 సంవత్సరాలకే బీసీలకు, ఎస్సీ, ఎస్టీలకు పెన్షన్ ఇస్తామంటూ గత ఎన్నికల ముందు ప్రకటించారు. అది కూడా అమలు చేయలేదు. బీసీ సంక్షేమ వసతి గృహాలను కొన్ని చోట్ల ఎత్తి వేశారు.

స్థానిక సంస్థల రిజర్వేషన్లలో కోత

స్థానిక సంస్థల రిజర్వేషన్‌లకు వైసీపీ ప్రభుత్వం కోత విధించింది. తెలుగు దేశం హయాంలోనే స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్‌లు కల్పించారు. తెలుగుదేశం ఆవిర్భావం తర్వాత రిజర్వేషన్‌లకు శ్రీకారం చుట్టారు. స్థానిక సంస్థల్లో బీసీలకు ప్రాధాన్యం ఇచ్చారు. అప్పటినుంచి బీసీ సామాజిక వర్గం రాజకీయంగా గుర్తింపు పొందింది. పంచాయతీలు, మండల పరిషత్‌లు, మునిసిపాల్టీల్లో ప్రాతినిధ్యం లభించింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత స్థానిక సంస్థలో బీసీలకు రిజర్వేషన్‌లు కుదించింది. గతంలో ఉన్న 34 శాతం రిజర్వేషన్‌లను 24 శాతానికి కుదించారు. దాంతో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సుమారు 90 పంచాయతీల్లో ప్రాధాన్యం తగ్గిపోయింది. ఉమ్మడి పశ్చిమలో 909 పంచాయతీలు ఉన్నాయి గతంలో 34 శాతం రిజర్వేషన్‌ల ప్రకారం 309 పంచాయతీల్లో బీసీలే ప్రాతినిధ్యం వహించేవారు. రిజర్వేషన్‌లు కుదించడంతో 218 పంచాయతీలకు ప్రాతినిధ్యం పడిపోయింది. ఇలా రాజకీయంగాను బీసీల ప్రాతినిధ్యాన్ని వైసీపీ ప్రభుత్వం తగ్గించేసేంది.

బీసీ ప్రణాళికలో టీడీపీ కూటమి

బీసీలకు తెలుగుదేశం కూటమి ప్రత్యేక ప్రణాళికను ప్రకటించింది. బీసీ సబ్ ప్లాన్‌ను అమలు చేసి నిధులు కేటాయిస్తామని చంద్రబాబు ప్రతీ సభలోను ప్రకటిస్తున్నారు. అలాగే ముఖ్యంగా స్థానిక సంస్థలల్లో ఎప్పటిలాగే 34 శాతం రిజర్వేషన్‌లు పెంచనున్నట్టు మేనిఫేస్టోలో ప్రకటించారు. అంతే కాకుండా 50 ఏళ్ళకే పెన్షన్ పథకాన్ని బీసీ మహిళలకు అమలు చేయనున్నారు. బీసీ కార్పొరేషన్ ద్వారా మళ్లీ రాయితీ రుణాలు ఇవ్వనున్నారు. ఆదరణ పథకాన్ని అమలు చేయనున్నారు. తెలుగుదేశం జయహో బీసీ సమావేశాలను ఏర్పాటు చేస్తోంది. కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరుతున్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోనూ బీసీ సమావేశాలను ఏర్పాటు చేశారు. వైసీపీ ప్రభుత్వం హయంలో జరిగిన నష్టాన్ని వివరిస్తున్నారు.

టీడీపీతోనే బీసీలకు ప్రయోజనం



తెలుగుదేశంతోనే బీసీలకు ప్రయోజనం చేకూరుతుంది. తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి దానికి కట్టుబడి ఉంది. ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి బీసీలకు అన్యాయం చేశారు. బీసీ ప్రయోజనాలను కాలరాశారు. ముఖ్యంగా రిజర్వేషన్‌లు కుదించేశారు. కుల కార్పొరేషన్‌లు ఎందుకు. పేరుకు కార్పొరేషన్‌లు ఏర్పాటు చేసి నిధులు ఇవ్వకపోతే ప్రయోజనమేంటి.

-బండారు వెంకట్రావు, టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు, తాడేపల్లిగూడెం

కూటమి మేనిఫెస్టోలో బీసీలకు పెద్దపీట



టీడీపీ హయాంలో రాయితీ రుణాలు తీసుకున్నారు. వ్యాపారాలు చేసుకున్నారు. ఆర్థికంగా నిలదొక్కుకున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీలను విస్మరించింది. తెలుగుదేశం మళ్లీ అధికారం లోకి వస్తే బీసీలకు ప్రత్యేక రక్షణ తీసుకువస్తామని చెపుతున్నారు. మేనిఫెస్టోలో బీసీలకు పెద్ద పీట వేశారు.

-పట్నాల రాంపండు, తాడేపల్లిగూడెం

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

పొత్తు..కత్తి



ఇతర పార్టీలతో కలిసి టీడీపీ ముందుకు

ఆ దిశగానే రాజకీయ వ్యూహాలు

కొన్నిసార్లు సక్సెస్..మరికొన్నిసార్లు ఫెయిల్

ఈసారి వైసీపీకి చుక్కలు చూపిస్తున్న కూటమి

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకు ఎన్నికల్లో వివిధ పార్టీలతో పొత్తు పెట్టుకుంటూనే ఉంది. కొన్నిసార్లు ఘన విజయం.. మరికొన్ని సార్లు మధ్యస్థ ఫలితాలతో సరిపెట్టుకుంటూ వచ్చింది. 1989 నుంచి ఇప్పటివరకు ఆరు సార్లు అసెంబ్లీకి ఎన్నికలు జరగ్గా టీడీపీ, ఇతర పార్టీలు పొత్తు భాగస్వామ్యంతోనే కత్తులు దూస్తూ వచ్చింది ఈ క్రమంలోనే ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఈ తరహా పొత్తులు కొన్నిసార్లు గెలుపునకు కలిసి వచ్చాయి. మరికొన్ని చోట్ల ఓటమి తప్పించలేకపోయాయి. చంద్రబాబు పార్టీ పగ్గాలు చేపట్టిన తర్వాత ప్రతీసారి ఎన్నికలకు వివిధ పార్టీల భాగస్వామ్యంతోనే కలిసి పొత్తులుగా ఏర్పడి కాంగ్రెస్, వైసీపీని ఢీకొంటూ వచ్చారు.

పొత్తులతోనే కత్తులు దూశారు

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల్లో వివిధ నియోజక వర్గాల్లో రాజకీయాలు విలక్షణంతో కూడుకున్నాయి. సీనియర్లు ఇక్కడ వెనుతిరగకుండా పార్టీ వ్యూహం అమలు చేసేవారు. ప్రత్యర్థి పార్టీలు ఎత్తులను చిత్తు చేసేలా ఏరోజు కారోజు వ్యూహం అమలు చేసేవారు. అప్పట్లో కొత్తపల్లి సుబ్బారాయుడు దగ్గర నుంచి కోటగిరి విద్యాధరరావు వరకు ఎన్నికల వ్యూహాల్లో తిరుగులేని ఆధిపత్యం ప్రదర్శించేవారు. 1989లో టీడీపీ వామపక్షాలతో జత కలిసింది. గ్రామస్థాయిలో అప్పుడున్న నియోజకవర్గాల్లో కేవలం 74 స్థానాలు మాత్రమే సాధించగలిగింది. ఒకవైపు వామపక్షాలు ఉద్యమ రూపంలో పొత్తుకు దిగినా టీడీపీ అప్పటి ఎన్నికల్లో ఓటమి తప్పలేదు. ఉమ్మడి పశ్చిమలో కాంగ్రెస్‌కు ఏడు స్థానాలు దక్కగా టీడీపీకి 6, సీపీఐకు ఒక స్థానం దక్కింది. అంటే పట్టణ ప్రాంతాల్లో కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఎన్నికల్లో పట్టు తగ్గకుండా అప్పట్లో వామపక్షాలతో పొత్తు కుదుర్చుకున్నారు. తిరిగి 1994లో టీడీపీ పక్కా వ్యూహం అమలు చేసింది. 1989 నాటి చేదు అనుభవాలను దృష్టిలో పెట్టుకుని అభ్యర్థుల ఎంపికతో పాటు వామపక్షాలతో అప్పటి ఎన్నికల సమరానికి దిగింది. రాష్ట్రవ్యాప్తంగా టీడీపీకి ఏకపక్షంగా విజయం దక్కింది. తిరుగులేని ఆధిక్యం ప్రదర్శించింది. టీడీపీకి 13 స్థానాలు, కాంగ్రెస్‌కు ఒకటి, వామపక్షాలకు రెండు స్థానాలు దక్కాయి. అప్పుడు జరిగిన ఎన్నికల్లోనే వామపక్షాలు కీలక స్థానాల్లో విజయం సొంతం చేసుకోగా ఆ తర్వాత పరిస్థితి పునరావృతం కాలేదు. ఇలాంటి ఫలితాలే తిరిగి 1999లోనూ టీడీపీ తన సొంతం చేసు కోగలిగింది. అయితే పొత్తులో వామపక్షాల స్థానంలోకి బీజేపీ వచ్చింది. చంద్రబాబు నేతృత్వంలో టీడీపీ జిల్లాలో 14 అసెంబ్లీ స్థానాలను గెలుచుగా ఒక స్థానాన్ని కాంగ్రెస్ మరో స్థానాన్ని ఇండిపెండెంట్ దక్కించుకోగలిగారు. 1994, 99లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ రాష్ట్రంలోనూ, జిల్లాలోనూ తన ఆధిక్యతను ప్రదర్శించింది.

2004 తర్వాత మారిన సీన్

1992 వరకు సార్వత్రిక ఎన్నికలు అన్నింటిలోనూ టీడీపీ అధికారం చేజిక్కించుకోవడానికి పొత్తులు వైపు మళ్లింది. వామపక్షాలు, బీజేపీతోనూ పొత్తులు కుదుర్చుకుంది. 2004లో కాంగ్రెస్ అనుకూల గాలి వీస్తున్నప్పుడు దీనిని అడ్డు కోవడానికి అప్పట్లో రెండోసారి కూడా బీజేపీతోనే పొత్తుకు దిగి ఎన్ని కలకు వెళ్లింది. అప్పటి ఎన్నికల్లో టీడీపీ కేవలం 4 స్థానాలే దక్కించుకోగలిగింది. కాంగ్రెస్ ఏకంగా 11 స్థానాల్లో ఆధిపత్యం ప్రదర్శించింది. 2009లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లోనూ టీడీపీ ఈసారి బీజేపీని వదిలిపెట్టి అప్పట్లో తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్)తో పాటు వామపక్షాలతో పొత్తు పెట్టుకుంది. అయినప్పటికి తగిన ఫలితం టీడీపీకి దక్కలేదు. రెండోసారి కూడా కాంగ్రెస్ 9 స్థానాలతో ఆధిక్యంలో ఉండగా 6 స్థానాలతో టీడీపీ సరిపెట్టుకోవాల్సి వచ్చింది. తిరిగి 2014 ఎన్నికల్లో టీడీపీ-బీజేపీ కూటమి కలిసి జిల్లాను స్వీప్ చేశాయి. 14 చోట్ల టీడీపీ, ఒక్క చోట బీజేపీ అభ్యర్థులు గెలవడంతో ఎక్కడ మరే పార్టీ ఖాతా కూడా తెరవలేకపోయింది.

కూటమితో వైసీపీలో సెగలు

ఈసారి జరిగే ఎన్నికల్లోనూ టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి పోటీ చేస్తున్నాయి. ఇంతకుముందు టీడీపీతో కలిసిన వామపక్షాలు ఈసారి కాంగ్రెస్‌తో జత కట్టాయి. సొంతంగా పార్టీ పెట్టిన తర్వాత పవన్ కల్యాణ్ ఈసారి టీడీపీతో పొత్తు కుదుర్చుకున్నారు. ఉమ్మడి పశ్చిమలో ఏకంగా ఆరు స్థానాల్లో పోటీ చేస్తున్నారు. ఉంగుటూరు, పోలవరం, భీమవరం, తాడేపల్లిగూడెం, నరసాపురం, నిడదవోలు నియోజకవర్గాల్లో జనసేన తలబడుతోంది. బీజేపీ సైతం ఈ కూటమిలోకి వచ్చి కైకలూరు అసెంబ్లీ స్థానం నుంచి పోటీకి దిగింది. ఉమ్మడి పశ్చిమలో ఆరు స్థానాల్లో జనసేన, ఒక స్థానంలో బీజేపీ, ఎనిమిది స్థానాల్లో టీడీపీ రంగంలోకి దిగి అధికార వైసీపీని ఢీకొడుతున్నాయి. ఈ కొత్త కూటమి కూడా అధికార పక్షానికి ఇప్పటికే చుక్కలు చూపిస్తోంది. అధికార వైసీపీకి ఎదురు గాలి వీస్తుండటంతో కూటమి అభ్యర్థులు దూసుకుపోయే పరిస్థితి ఉంది.

ఇంటింటికి జగన్ స్టిక్కర్లు..

కోడ్ ఉల్లంఘనపై ఫిర్యాదు..కేసు నమోదు

తాడేపల్లిగూడెం రూరల్, మే 7: తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో వైసీపీ నాయకులు గ్రామాల్లో జగన్ మోహనరెడ్డి స్టిక్కర్లను అంటిస్తూ కోడ్ ఉల్లంఘనకు పాల్పడుతున్నారు. గ్రామాల్లో ప్రచారం పేరుతో ఇంటింటికి తిరుగుతూ స్టిక్కర్లు అంటిస్తున్నారు కొన్ని గ్రామాల్లో కార్యదర్శులు వారిస్తున్నా తాము అనుమతి తెచ్చుకు న్నామని చెబుతున్నారు. మండలంలోని మాధవరంలో నాయకులు స్టిక్కర్లు అంటిస్తుంటే పంచాయతీ సిబ్బంది వాటిని తొలగించే పనిలో పడ్డారు. కుంచనపల్లి, జగ్గన్నపేట ఒకటేమిటి అన్ని గ్రామాల్లో స్టిక్కర్‌లు అంటిస్తూ కోడ్ ఉల్లంఘనకు పాల్పడుతున్నారు. రిటర్నింగ్ అధికారి చర్యలు తీసుకోవాలని కూటమి నాయకులు కోరుతున్నారు. తాడే పల్లిగూడెం మండలంలో జగన్ సిద్ధం స్టిక్కర్లు అంటించి కోడ్ ఉల్లంఘనకు పాల్పడ్డారని మాధవరంలో బండారు నాగ రాజు సి-విజిల్ యాప్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి బీవీఎస్‌బీ రాజు తనిఖీ చేశారు. వైసీపీ సానుభూతిపరులు అతికించినట్టు గుర్తించి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. కుంచనపల్లిలో జువ్వల వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి రాజు పరిశీలించి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్టు ఎస్సై సురేష్ వివరించారు.



జగ్గన్నపేటలో కరెంటు స్తంభాలకు,ఇళ్లకు జగన్ స్టిక్కర్లు

ఎవరు గెలిచినా మీదే గెలుపు

జిల్లా స్థాయి కూపన్ నెం.3

పాఠకుని పూర్తి పేరు : ....

దోరు నెంబరు : .... వీధి పేరు : ....

గ్రామం/పట్టణం : .... మండలం : ....

జిల్లా : .... పోస్టల్ పిన్‌కోడ్ : ....ఫోన్ నెం. ....

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ఒకొక్క అసెంబ్లీ స్థానంలో ఎవరు గెలుస్తారు అనేది, మీరు ఊహించిన అభ్యర్థి ఎదురుగా గడిలో టిక్ ✔ మార్క్ చేయండి.

నియోజకవర్గం పేరు	NDA కూటమి	YSRCP	కాంగ్రెస్	ఇతరులు
1. ఆచంట				
2. పాలకొల్లు				
3. నరసాపురం				
4. భీమవరం				
5. ఉండి				
6. తణుకు				
7. తాడేపల్లిగూడెం				
8. ఉంగుటూరు				
9. దెందులూరు				
10. ఏలూరు				
11. పోలవరం				
12. చింతలపూడి				
13. గోపాలపురం				
14. కొవ్వూరు				
15. నిడదవోలు				
మొత్తం :				

కూపన్ పూర్తి చేసి వెంటనే ఈ దిగువ అడ్రస్‌కు పోస్టు ద్వారా గానీ, పర్సనల్‌గా గానీ పంపే ఏర్పాటు చేయండి

ఆంధ్రజ్యోతి కార్యాలయం : రాచర్ల రోడ్, అలంపురం, తాడేపల్లిగూడెం, పశ్చిమగోదావరి జిల్లా - 534 166.

జిల్లా వ్యాప్తంగా ఎస్ఈబీ దాడులు..11 మంది అరెస్టు



ఏలూరు క్రైం, మే 7 : ఏలూరు జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు జిల్లా ఎస్ఈబీ అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు ఆధ్వర్యంలో సోమవారం జిల్లా వ్యాప్తంగా దాడులు నిర్వహించారు. జిల్లాలోని చింతలపూడి, భీమడోలు, జంగారెడ్డిగూడెం, నూజివీడు, పోలవరం, ఏలూరు, కైకలూరు ఎస్ఇబి పోలీస్ స్టేషన్ అధికారులు, చెక్‌పోస్టు సిబ్బంది కలిసి దాడులు నిర్వహించారు. సారా తయారీ, విక్రయ దారులపై 4 కేసులు నమోదు చేసి వారి నుంచి 60 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. 3,500 లీటర్ల బెల్లపుఊట ధ్వంసం చేసి 2 కేసులు నమోదు చేశారు. డ్యూటీపెయిడ్ లిక్కర్ కలిగి ఉన్నవారిపై 9 కేసులు నమోదు చేసి 62.24 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 15 కేసులలో 11 మంది వ్యక్తులను అరెస్టు చేశారు.7 ప్రాంతాల్లో కార్డెన్ సెర్చ్ నిర్వహించి 16 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు అదనపు ఎస్పీ తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమమే మా ధ్యేయం



- ఆక్వా రంగానికి పూర్వ వైభవం తెస్తాం
- కొల్లేరు సమస్య పరిష్కరిస్తాం
- రోడ్లు, డ్రెయినేజీ, తాగునీరు వంటి మౌలిక వసతులకు ప్రాధాన్యం
- ఆంధ్రజ్యోతితో ఉంగుటూరు ఎమ్మెల్యే కూటమి అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు

నిడమర్రు, మే 7 : 'ప్రజలకు సంక్షేమ ఫలాలు అందిస్తూ అభివృద్ధి వైపు సాగడమే లక్ష్యం. మధ్యతరగతి వ్యవసాయ కుటుంబంలో కిందస్థాయి నుంచి వచ్చిన వ్యక్తిగా ప్రజల కష్టాల గురించి తెలుసు.. ప్రజల జీవితాల్లో వెలుగులు నింపడానికి కృషి చేస్తా. ఉంగుటూరు నియోజకవర్గం ఎన్నో వనరుల గల ప్రాంతం ఓవైపు వ్యవసాయంతో పాటు సహజ సిద్ధమైన కొల్లేరు భూములు ఇక్కడ చేప, రొయ్య పెరుగుదలకు ఎంతో దోహదపడతాయి. రైతుల మనుగడ కాపాడుతూ కొల్లేరు పర్యావరణహితంగా అభివృద్ధికి ప్రణాళిక ఉంది' అని ఉంగుటూరు ఎమ్మెల్యే కూటమి అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు గెలుపు ధీమా వ్యక్తం చేశారు. ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలను వెల్లడించారు.

• ఎన్నికల ప్రచారం ఏవిధంగా సాగుతోంది ?

ఎన్నికల ప్రచారం చాలాబాగా జరుగుతోంది. అధికార వైసీపీ ఆగడాలను, బెదిరింపులను, మోసాలను ప్రజలు లెక్క చేయకుండా స్వచ్ఛందంగా ప్రచారంలో పాల్గొంటున్నారు.

• నిరుద్యోగ యువతకు మీ భరోసా ఏమిటి ?

ఉంగుటూరు నియోజకవర్గంలో ఆదాయ వనరులకు కొదవలేదు. మత్స్య సంపద విశేషంగా ఉండడంతో ప్రాసెసింగ్ యూనిట్లు పెట్టుకొంటే యువతకు చక్కటి ఉపాధి అవకాశాలు కల్గుతాయి. ప్రణాళికబద్ధంగా అభివృద్ధి చేస్తాం.

• భవన నిర్మాణ కార్మికుల కష్టాలు ఏ విధంగా తొలగిస్తారు ?

సీఎం జగన్ తప్పుడు నిర్ణయాల వల్ల రియల్ ఎస్టేట్ రంగం పూర్తిగా దెబ్బతింది. భవన నిర్మాణ కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. మా నాయకుడు పవన్ కల్యాణ్ రాష్ట్రంలోనే ముందుగా ఈ సమస్యపై స్పందించారు. కార్మిక సంక్షేమ బోర్డు నిధులు రూ.450 కోట్లు దారి మళ్లించడంతో వారికి సంక్షేమ ఫలాలు లేకుండా పోయాయి. ఈ బోర్డు కోసం పవన్‌కల్యాణ్ తన సొంత సొమ్ము రూ.కోటి రూపాయలు ఇస్తానని హామీ ఇచ్చారు.

• మెట్ట వ్యవసాయానికి ఏం చేస్తారు ?

మెట్ట వ్యవసాయాన్ని వైసీపీ ప్రభుత్వం పూర్తిగా అశ్రద్ధ చేసింది. సబ్సిడీలు అందించలేదు. డ్రిప్ ఇరిగేషన్ సబ్సిడీ, ఉచిత విత్తనాలు, మొక్కల పంపిణీ, వివిధ రాయితీలను రద్దు చేశారు. మెట్ట వ్యవసాయం అభివృద్ధి కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటాం. కోల్డ్ స్టోరేజీలు, గిడ్డంగులు, తోటల బీమా పథకాలు వర్తించేలా చూస్తాం.

• కొల్లేరు సమస్యను ఏ విధంగా పరిష్కరిస్తారు ?

వైసీపీ ప్రభుత్వ అశ్రద్ధ వల్ల కెనాల్ వ్యవస్థ పూర్తిగా నాశనమైంది. కొల్లేరు ప్రజలకు తాగునీరు, రోడ్డు, విద్యుత్ సౌకర్యాలు కల్పిస్తూ వారి ఆదాయం పెంచడం కోసం చర్యలు తీసుకుంటూ పర్యావరణ హితంగా కొల్లేరు అభివృద్ధి చేస్తాం. రెగ్యులేటర్‌లు నిర్మించడం, కెనాల్స్ బాగు చేయడం, కాంటూరు సమస్యను పరిష్కరించేలా చర్యలు చేపడతాం.

• ఆక్వా రంగ అభివృద్ధికి ఏం చేయబోతున్నారు ?

ఈ ప్రభుత్వానికి ఆక్వా రంగంపై అవగాహన లేదు. నాణ్యమైన విద్యుత్‌ను అందించలేకపోయారు. చేపలు, రొయ్యల గిట్టుబాటు ధర కోసం కోల్డ్ స్టోరేజ్ నిర్మాణం చేయడం, రైల్వేల ద్వారా పొరుగు రాష్ట్రాలకు ఎగుమతులు చేయవచ్చు. నాణ్యమైన సీడ్, ఫీడ్ అందించడంలో ప్రభుత్వం మానిటరింగ్ చేయలేకపోవడం వల్లే రైతులు నష్టపోతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆక్వా రంగానికి పూర్వ వైభవం తెస్తాం.

• తాగునీటి సమస్యను ఏవిధంగా తీరుస్తారు ?

నియోజవర్గంలో సుమారు 64 గ్రామాలకు ఇప్పటికీ తాగునీరు లేదని మొన్న గణపవరం మీటింగ్‌లో మా అధినేత పవన్ తెలిపారు. మంచినీరు టిన్నులతో కొనుక్కొని తాగుతున్నారు. కేంద్రం సహకారంతో శాశ్వత పరిష్కారంగా పోలవరం నుంచి పైప్ లైన్ వేసి తాగునీరు అందించేందుకు కృషి చేస్తాం.

• మీకే ఎందుకు ఓటు వేయాలి ?

ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో వచ్చా.. అవకాశం ఇమ్మని వినయంగా వేడుకొంటున్నా. ప్రజలు అవకాశం ఇచ్చిన తరువాత అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ముందడుగు వేస్తాను. అందరి మన్ననలు పొందుతాను. ఉంగుటూరు అసెంబ్లీ స్థానం బ్యాలెట్‌లో గాజు గ్లాసు గుర్తుకు, ఏలూరు పార్లమెంటరీ నియోజవర్గ బ్యాలెట్‌లో సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని కోరుతున్నాను.

వైఫల్యాల వైసీపీని ఓడిద్దాం.. టీడీపీని గెలిపిద్దాం

- దెందులూరు ఎమ్మెల్యే కూటమి అభ్యర్థి చింతమనేని ప్రభాకర్



గజమాలతో జనసేన నాయకుల అభిమానం

పెదవేగి, మే 7 : పథకాల పేరుచెప్పి దోచుకు తిన్న వైఫల్యాల వైసీపీని ఓడించి, ప్రజా సంక్షేమాన్ని కాపాడే టీడీపీని గెలిపించాలని దెందులూరు కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి చింతమనేని ప్రభాకర్ పిలుపునిచ్చారు. మండలంలోని భోగాపురం, అమ్మపాలెం, పెదకడిమి, పినకడిమి, కొప్పాక, అంకన్నగూడెం, బి.సింగవరం గ్రామాల్లో జనసేన, బీజేపీ నాయకులతో కలిసి మంగళవారం విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టీడీపీతో రాష్ట్ర భవిష్యత్ ఆధారపడి ఉందన్నారు. ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని కూటమి విజయానికి కృషి చేయాలని సూచించారు. ఐదేళ్ళ వైసీపీ పాలనలో రాష్ట్రం ఆర్థికంగా, సామాజికంగా ఇరవైఏళ్లు వెనక్కిపోయిందని, దాడులు, దౌర్జన్యాలు పెరిగిపోయా యన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే సంక్షేమ పాలన అందుతుందని భరోసా ఇ చ్చారు. ఎన్డీయే కూటమి అభ్యర్థుల విజయానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. జనసేన నాయకులు కొఠారు ఆదిశేషు, లక్ష్మి, టీడీపీ నాయకులు బొప్పన సుధాకర్, తాతా సత్యనారాయణ, కొసరాజు బలరామకృష్ణ, చల్లగొళ్ళ వెంకట్రావు, మట్టా నాగరాజు పాల్గొన్నారు.

'చింతమనేనిని విమర్శించే స్థాయి మీకు లేదు'

ఏలూరు రూరల్, మే 7: దెందులూరు మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌ను విమర్శించే స్థాయి గుడివాకలంక వైసీపీ నాయకులకు లేదని ఆ గ్రామ టీడీపీ నాయకులు మండిపడ్డారు. గ్రామంలో మంగళవారం విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ ఇటీవల వైసీపీ నాయకులు టీడీపీ అభ్యర్థి చింతమనేనిపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. సుమారు రూ.20 కోట్లమేర అభివృద్ధి కార్యక్రమాలు చింతమనేని చేశారని తెలిపారు. కొల్లేరు 5వ కాంటూరు నుంచి మూడో కాంటూరు కుదింపునకు చింతమనేని విశేషంగా కృషి చేశారన్నారు. వచ్చే ఎన్నికల్లో చింతమనేని విజయం తథ్యమని ఓటమిని జీర్ణించుకోలేక వైసీపీ నాయకులు అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. జయమంగళ దొరబాబు, ఘంటసాల నాగరాజు, మోరు విజయరామరాజు, ఘంటసాల కుటుంబరావు, బలే వెంకటేష్, జగపతిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణతోనే మాదిగలకు మేలు

టి.నరసాపురం, మే 7:ఎస్సీ వర్గీకరణతోనే మాదిగలకు మేలు జరుగుతుందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు విస్సంపల్లి సిద్ధూ మాదిగ తెలిపారు. మండలంలో ఎమ్మార్పీఎస్ నాయకులు టీడీపీ ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌కుమార్ యాదవ్, జనసేన పార్టీ పోలవరం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి చిర్రి బాలరాజులను గెలిపించాలని కోరుతూ మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం బందంచర్ల గ్రామంలోని జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద గ్రామసభ, గ్రామ కమిటీ అధ్యక్షులు ఉప్పులూరి సతీష్ మాదిగ అధ్యక్షతన ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు నిర్వహించారు.ముఖ్య అతిథిగా సిద్ధూ మాదిగ మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎన్డీయే కూటమి అభ్యర్థుల విజయం కోసం ప్రచారం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఉప్పులూరి ఇస్రయ్య, పల్లిపాం సర్వేష్, నందిపాం వెంకటేశ్వరరావు, పల్లిపాం కృష్ణ, నందిపాం చిన్న వెంకటేశ్వరరావు, శికాకొల్లు పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరు వరకు ఏపీజీఎల్ఐ ఫిర్యాదుల స్వీకరణ

ఏలూరు ఎడ్యుకేషన్, మే 7:ఏపీజీఎల్ఐ పాలసీదారులైన రాష్ట్రప్రభుత్వ ఉపాధ్యాయుల నుంచి ఫిర్యాదుల స్వీకరణ గడువును ఈనెల 31 వరకు పొడిగిస్తూ బీమా ప్రధాన కార్యాలయం అధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 1998లో ప్రారంభమైన ఏపీజీఎల్ఐ పథకం లావాదేవీలన్నీ మాన్యువల్‌గానే కొనసాగుతున్నాయని, ఇటీవలే ఆన్‌లైన్‌ద్వారా దరఖాస్తుల సమర్పణ, రుణాలు ఇవ్వడం, బాండ్‌ల స్వీకరణ, ముగింపులు, నామినీ మార్పులు, పుట్టినతేదీ మార్పులువంటి లావాదేవీలను చేపట్టిన నేపథ్యంలో కొందరు చందాదారుల లావాదేవీల్లో తేడాలు చూపిస్తున్నందున సంబంధిత ఫిర్యాదులను తీసుకునేందుకు గడువును పొడిగించాలన్నారు. తమ సంఘం చేసిన అభ్యర్థన మేరకు ఈ నెలాఖరువరకు పొడిగిస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారని వివరించారు.

చింతలపూడిని అభివృద్ధి చేస్తా

- యువత కోసం పరిశ్రమ ఏర్పాటుకు కృషి చేస్తా..
- పామాయిల్, మొక్కజొన్నకు గిట్టుబాటు ధర తెస్తా..
- ఏలూరు ఎంపీ కూటమి అభ్యర్థి పుట్టా మహేష్‌యాదవ్



గొల్లగూడెం సభలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి పుట్టా

చింతలపూడి, మే 7 : 'చింతలపూడి మెట్టప్రాంతం.. చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తిచేసి సాగునీరు అందిస్తా.. చదువుకున్న యువకుల ఉపాధికోసం పరిశ్రమ ఏర్పాటుకు కృషిచేస్తా.. రైతులకు పామాయిల్, మొక్కజొన్న గిట్టుబాటు ధరల కోసం కృషిచేస్తా.. ప్రధాని మోదీ కూడా రాష్ట్రంలోని ప్రాజెక్టులపై ప్రస్తావన తెచ్చారు. మీ వాణిని పార్లమెంట్‌లో వినిపిస్తా.. గత ఎంపీల మాదిరిగా కాదు, నేను పనిచేసే వాడిని, నాకు చాలా పరిశ్రమలు ఉన్నాయి. ఏనాడూ తాను టిక్కెట్ కోసం ఆశించలేదు. నా సమర్థత చూసి టీడీపీ జాతీయనేత చంద్రబాబు పిలిచి టిక్కెట్ ఇచ్చి పోటీ చేయమన్నారు.. మీ ఆశీస్సులు అందిస్తే మీ ప్రాంతాన్ని చింతలేని చింతలపూడిగా మారుస్తా.. నమ్మండి యువకుడు అయిన అసెంబ్లీకి సొంగా రోషన్‌కుమార్‌ను, నన్ను పార్లమెంట్‌కు అత్యధిక మెజార్టీతో గెలిపించండి' అంటూ సభలో ప్రజల కరతాళ ధ్వనుల మధ్య ఏలూరు ఎంపీ టీడీపీ అభ్యర్థి పుట్టా మహేష్‌యాదవ్ మాట్లాడారు. ప్రగడవరంలోని గొల్లగూడెంలో జరిపిన ఈ ప్రసంగం అక్కడ అందర్ని ఆకట్టుకుంది. తొలుత ప్రగడవరం పంచాయతీలోని వెలగలపల్లి, ఫాతిమాపురం, శ్రీరామ్‌పురం, వెంకంపాలెం కాలనీ, విద్యాధరపల్లి నుంచి గొల్లగూడెం చేరుకుని ప్రసంగించారు. అనంతరం 200మంది వైసీపీ నుంచి టీడీపీలో చేరడంతో కండువాలు కప్పి స్వాగతించారు. అక్కడి నుంచి పొనుకుమాడు, నరసింగపురం, కంచెనగూడెం, దేశవరం గ్రామాల్లో జోరు వర్షంలో పర్యటించారు. కంచెనగూడెంలో అనారోగ్యంతో ఉన్న కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించారు. టీడీపీ నాయకులు జగ్గవరపు ముత్తారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, కె.రాజారెడ్డి, చిలుకూరి శ్రీనివాసరెడ్డి, సుధీర్‌రెడ్డి, బుద్దాల నాగు, మానికల అంజయ్య, వెంకటేశ్వరరావు, శ్రీనివాసయాదవ్, కొప్పెర్ల నాగరాజు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కలరాయునిగూడెంలో టీడీపీలో చేరుతున్న వైసీపీ కార్యకర్తలు

పోతునూరులో 50 కుటుంబాలు టీడీపీలో చేరిక

ప్రగడవరం నుంచి వర్షంలో పోతునూరు గ్రామం చేరుకున్నారు. ఈ గ్రామంలో 50 వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరడంతో వారికి పుట్టా మహేష్ కండువాలు కప్పి స్వాగతించారు. అనుభవం ఉన్న చంద్రబాబు వల్లే ఈ రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమం అమలు జరుగుతాయన్నారు. పాల్‌రాజు, సత్యనారాయణరెడ్డి, భాస్కర్‌రావు, జయరాజు, రామకృష్ణ, కొమ్ము నాగేంద్ర, ప్రసాద్, వెంకటేశ్వరరావు, పలువురు పాల్గొన్నారు.

కలరాయనిగూడెంలో 15 కుటుంబాలు చేరిక

లింగపాలెం, మే 7 : టీడీపీ ప్రభుత్వంలోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని బడుగు, బలహీనవర్గాలకులబ్ధి చేకూరుతుందని ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌కుమార్‌యాదవ్ అన్నారు. చింతలపూడి నియోజకవర్గంలో ప్రచారానికి వెళుతూ కలరాయనిగూడెంలో కార్యకర్తలతో మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామంలో వైసీపీకి చెందిన 15 కుటుంబాలు టీడీపీలో చేరారు. ఎంపీ అభ్యర్థి మహేష్‌కుమార్‌యాదవ్ కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైసీపీ విధి విధానాలు నచ్చక టీడీపీలో చేరుతున్నామని తెలిపారు. నందిగం సీతారామతిలక్, రాంబాబు, నందిగం శ్రీధర్, ముసునూరి గంగాధర్‌రావు, ముసునూరి సత్యనారాయణ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





ఏలూరు ప్రజాసంకల్ప యాత్రలో బడేటి చంటి, బార్ అసోసియేషన్ సభలో మాట్లాడుతున్న చంటి

కూటమి విజయం తథ్యం

- ఏలూరు కూటమి అభ్యర్థి బడేటి చంటి

ఏలూరుటూటౌన్, మే 7: రోజురోజుకు వస్తున్న ప్రజాదరణ చూస్తుంటే కూటమి విజయం తథ్యమని ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి బడేటి చంటి అన్నారు. ప్రజాసంకల్ప యాత్రలో భాగంగా శనివారపుపేట ఇందిరా కాలనీలో ఆయన పర్యటించి మాట్లాడారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌ను ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధమయ్యారన్నారు. ప్రజాసమస్యలు తెలుసు కుంటూ ముందుకు సాగారు. ప్రభుత్వం ప్రకటించిన మేనిఫెస్టో ప్రజలను ఆకట్టుకుందన్నారు. పోస్టల్ బ్యాలెట్‌లో ప్రభుత్వ ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొనడం చూస్తే వైసీపీపై ఎంతో విరక్తితో ఉన్నారని తెలుస్తుందన్నారు. సాయంత్రం 11వ డివిజన్ కుండీ సెంటర్ నుంచి ప్రజాసంకల్ప యాత్ర ప్రారంభమైంది. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం ఒక చంద్రబాబుతోనే సాధ్యమన్న విషయం ప్రజలు గ్రహించారన్నారు. జగన్‌ను ఎప్పుడు సాగనంపుదామా అని ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. టీడీపీ బ్రాహ్మణ సాధికార సమితి జిల్లా కన్వీనర్ ఎంటీఎస్ శర్మ, మట్టా రాజేశ్వరి, లంకపల్లి మాణిక్యాలరావు, విజయలక్ష్మి, మట్టా రంజిత్ తదితరులు పల్గొన్నారు.

రాష్ట్రంలో అన్యాయ పాలన

ఏలూరుటూటౌన్/ఏలూరు క్రైం : రాష్ట్రంలో అన్యాయ పాలనకొనసాగిస్తున్న వైసీపీ ప్రభుత్వం నైతికంగా కొనసాగే హక్కు లేదని ఏలూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బడేటి రాధాకృష్ణయ్య విమర్శించారు. ఏలూరు బార్ అసోసియేషన్ భవనంలో మంగళవారం ఆత్మీయ సమావేశం జరిగింది. బార్ అసోసియేషన్ అధ్యక్షులు విజయ్‌కుమార్, కార్యదర్శి నాగరాజు, లాయర్లు రాజశేఖర్, నిమ్మల జ్యోతికుమార్, సాయిరమేష్, వరప్రసాదరావు, నారాయణ, అమర్, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి, సంక్షేమం

- చింతలపూడి కూటమి అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్



కరాటం రాంబాబుకు మొక్కను అందిస్తున్న సొంగా, నాయకులు

చింతలపూడి, మే 7: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే సాధ్యమవుతుందని కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్, అసెంబ్లీ అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ కోరారు. జంగారెడ్డిగూడెం మండలంలో అసెంబ్లీ అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ ఉదయం తాడువాయి గ్రామంలో సూపర్‌సిక్స్ పథకాలపై వివరిస్తూ బీసీలకు, మహిళలకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. జంగారెడ్డిగూడెంలో కాపు ఆత్మీయ సమావేశంలో పలువురు వైసీపీ నుంచి టీడీపీలోకి చేరడంతో వారికి పుట్టా మహేష్ కండువాకప్పి స్వాగతించారు. కాపుల సంక్షేమం బీసీలకు 50 ఏళ్ళకే పెన్షన్ పథకం ఇవన్నీ కూటమి ప్రభుత్వం రాగానే సాధ్యం అవుతాయన్నారు. అనంతరం సాయంత్రం పొద్దుపోయే వరకు గుర్వాయిగూడెం, చక్రదేవపల్లి గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి ఎన్నికల ప్రచారం చేశారు. కార్యక్రమాల్లో కరాటం రాంబాబు, రావూరి కృష్ణ, దాసరి శ్యామ్‌చందరశేషు, సాయిల సత్యనారాయణ, మండవ లక్ష్మణరావు, మాధవరావు, అనిల్, సూరిబాబు, పలువురు నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.

'ఆస్తమా'పై ఆయుష్ అవగాహన

ఏలూరు ఎడ్యుకేషన్, మే 7 : నిద్రలో గురక ఆస్తమా సంబంధిత రుగ్మతేకావచ్చని ఆయుష్ హాస్పిటల్స్ ఊపిరితిత్తుల వైద్యనిపుణుడు డాక్టర్ వేగి రెడ్డి సుజేష్ అన్నారు. ప్రపంచ ఆస్తమా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఏలూరు ఆయుష్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో స్థానిక సీఆర్ఆర్ డిగ్రీ కళాశాల క్రీడామైదానంలో ఉచిత వైద్యశిబిరంలో ఆస్తమా నిర్ధారణ పరీక్షలు, అవగాహన సదస్సు జరిగిం ది. ఆయుష్ హాస్పిటల్స్ మేనేజర్ కాశీనాథ్ జాస్తి పాల్గొన్నారు.

20 కార్లతో జనసేన ర్యాలీ

కుక్కునూరు, మే 7 : చింతలపూడి జనసేన ఇన్‌చార్జి మేకా ఈశ్వరయ్య ఆధ్వర్యంలో పోలవరం జనసేన అభ్యర్థి చిర్రి బాలరాజుకు మద్దతుగా 20 కారులలో దాదాపు వంద మందితో కుక్కునూరు మండలంలో ప్రచారం నిర్వహించారు. టీడీపీ నాయకులు తాళ్లూరి సురేష్, జనసేన మండల అధ్యక్షులు ఎం.యుగంధర్, మంత్రి గోపాలకృష్ణ, వెంకన్నబాబు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ల్యాండ్ టైటిల్ యాక్టు రద్దు చేయాలి

కామవరపుకోట/చింతలపూడి/గణపవరం, మే 7 : ఏపీ ప్రభుత్వం రైతుల భూమి యాజమాన్య హక్కులు హరించే విధంగా రూపొందించిన ల్యాండ్‌టైటిల్ యాక్టును రద్దుచేయాలని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద కూటమి నాయకులు ఆందోళన చేసి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ ఆధ్వర్యంలో కార్యాలయ ఉద్యోగులకు అందజేశారు. చింతలపూడి మండలం తహసీల్దార్ కార్యాలయంలో టీడీపీ మండలాధ్యక్షుడు మాటూరి వెంకటరామయ్య, పట్టణ అధ్యక్షుడు పక్కాల వెంకటేశ్వరరావు, జిల్లా టీడీపీ రైతుసంఘ అధ్యక్షుడు గుత్తా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. గణపవరం మండలం తహసీల్దార్ కార్యాలయం ఎదుట టైటిలింగ్ యాక్ట్‌కు నిరసనగా టీడీపీ మండల అధ్యక్షుడు ఇందుకూరి రామకృష్ణంరాజు ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన నాయకులు ధర్నా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌వో అనూషకు వినతిపత్రం అందజేశారు.

జోరు వాన



పెదవేగిలో కురుస్తున్న వర్షం

పెదవేగి/చింతలపూడి/జీలుగుమిల్లి/భీమడోలు/ఉంగుటూరు/పోలవరం, మే 7 : జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల మంగళవారం మధ్యాహ్నం ఊహించని రీతిలో పిడుగులతో కూడిన వర్షం కురిసింది. ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. ఉద్యానపంటలకు ఈ వర్షం మేలు చేస్తుంది. పెదవేగి మండలం గోపన్నపాలెం- బాదరాల రోడ్డులో దిబ్బగూడెం దగ్గర రహదారిపై నీరు నిలిచి, కుంటను తలపిస్తోంది. రహదారిపై భారీగా చేరిన నీటితో వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. చింతలపూడి మండలంలో వర్షంతోపాటు గాలులకు పలుచోట్ల విద్యుత్‌తీగలు తెగిపడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. జీలుగుమిల్లి మండలంలో ఈదురు గాలులతో కూడిన వర్షానికి పొగాకు, అరటి, వేరుశనగ పంటల రైతులకు నష్టం వాటిల్లింది. గ్రామానికి చెందిన చిర్రి వెంకటేశ్వరావు నాలుగు ఎకరాల అరటి పంట గెలలతో ఉండడంతో ఈదురు గాలులకు నేలకొరిగింది. ఎకరాలకు రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టినట్టు రైతు వాపోయాడు. పొగాకు బ్యారన్‌ల వద్ద ఆకాల వర్షానికి పొగాకు తడిసినట్టు పలువురు రైతులు చెబుతున్నారు. పలు గిరిజన గ్రామాల్లో కరెంట్ సరఫరాకు అంతరాయం రావడంతో అంధకారంలో ఉన్నాయి. భీమడోలు మండలంలోని పలు గ్రామాల్లో చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలి ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఈదురుగాలుల ధాటికి భీమడోలు, పోలసానపల్లి, ఎంఎంపురం, గుండుగొలను గ్రామాల్లో చెట్లు విరిగాయి. గుండుగొలను ఎస్సీపేటలో శివ అనే వ్యక్తి ఇంటిపై విద్యుత్ స్తంభం పడిపోవడంతో ప్రమాదం తప్పింది. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడి ప్రజలు ఇక్కట్లకు గురయ్యారు. విద్యుత్‌శాఖ అధికారులు మరమ్మతులు చేపట్టారు. ఉంగుటూరు మండలంలో వర్షంతోపాటు పిడుగులు పడడంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. పోలవరం మండలంలో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. పలుచోట్ల రోడ్లపై చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. పైడిపాక చంద్రన్న పునరావాస కాలనీలో పిడుగుపడి కొబ్బరి చెట్టు దగ్ధమైంది.

'చిర్రి బాలరాజుకు భారీ విజయం తథ్యం'



కన్నాపురంలో నాయకులతో చర్చిస్తున్న కరాటం రాంబాబు

కొయ్యలగూడెం, మే 7: పోలవరంలో కూటమి అభ్యర్థి చిర్రి బాలరాజు భారీ మెజారిటీతో గెలుపొందుతారని టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ బొగరం శ్రీనివాస్ అన్నారు. మండలంలోని కన్నాపురం, దిప్పకాయలపాడు, అచ్యుతాపురం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమిలో భాగంగా పోలవరం సీటును జనసేనకు కేటాయించారని, ప్రతి ఒక్కరు కూటమి అభ్యర్థి చిర్రి బాలరాజును గెలిపించుకోవాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ఎంపీ అభ్యర్థి మహేష్‌యాదవ్‌ను కూడా గెలిపించాలన్నారు. కార్యక్రమంలో మాజీ డీసీసీబీ చైర్మన్ కారటం రాంబాబు, టీడీపీ సీనియర్ నేత విద్యాసాగర్, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూటమి నేతల ప్రచారం

పోలవరం నియోజకవర్గంలో కూటమి అభ్యర్థుల ప్రచారం జోరందుకుంది. టీడీపీ పరిశీలకుడు వెంకటనారాయణ, జనసేన పరిశీలకుడు మహేష్, సౌజన్య ప్రచారాన్ని ముమ్మరం చేశారు. నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను ప్రజలకు వివరిస్తున్నారు. ఇంటింటా ప్రచారం చేస్తూ ఎమ్మెల్యే అభ్యర్థి చిర్రి బాలరాజు, ఎంపీ అభ్యర్థి మహేష్‌యాదవ్‌ను గెలిపించాలంటూ ప్రచారం ముందుకుసాగుతుంది.

ధర్మరాజుకు అపూర్వ స్వాగతం

- ఉత్సాహంగా మోటారు సైకిళ్ల ర్యాలీ



ఉంగుటూరు మండలం ర్యాలీలో పత్సమట్ల ధర్మరాజు

ఉంగుటూరు మే 7 :ఉంగుటూరు నియోజకవర్గం లోని గ్రామాల్లోని ప్రజలు ఉంగుటూరు కూటమి అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజుకు అపూర్వ స్వాగతం పలుకుతున్నారు. మంగళవారం మండలంలోని నారాయణపురం, ఉంగుటూరు, నీలాద్రిపురం, గుళ్లపాడు, యర్రమళ్ళ గ్రామాల్లో మోటారు సైకిళ్ల ర్యాలీ నిర్వహించారు. సాయంత్రం బొమ్మిడి, కాగుపాడు, బాదంపూడి, యర్రమిల్లి గ్రామాల్లో బైక్ ర్యాలీని తిరిగి కొనసాగించారు. ఈ సందర్భంగా టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు పెద్దఎత్తున ర్యాలీలో పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో ధర్మరాజుకు మహిళలు హారతులిచ్చారు. పలువురు ఆయనను దుశ్శాలువ, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ప్రచారంలో భాగంగా ఆయన మాట్లాడుతూ కూటమి అభ్యర్థుల విజయానికి సహకరించాలని కోరారు. అసెంబ్లీ నియోజకవర్గానికి గాజు గ్లాసుకు, పార్లమెంటరీ నియోజకవర్గానికి సైకిల్‌కు ఓటు వేసి ఆశీర్వదించాలన్నారు.

మన్యం వీరుడా మన్నించు



జిల్లా పరిషత్ కార్యాలయం, కలెక్టరేట్‌లో అల్లూరి విగ్రహాలకు పూలమాల వేయడం మరచిన అధికారులు

ఏలూరు రూరల్, మే 7: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి రోజున ఏలూరు జిల్లా పరిషత్ కార్యాలయంలోనే కలెక్టరేట్ ప్రాంగణంలో ఉన్న ఆయన విగ్రహానికి కనీసం దండవేసి నివాళులర్పించిన అధికారి ఒక్కరూ కనిపించలేదు. అల్లూరి త్యాగాన్ని గుర్తు చేసుకోవాల్సిన అధికారులు కనీసం ఆటుగా కన్నెత్తి చూడకపోవడంపై పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

అల్లూరికి ఘన నివాళి

ఏలూరుటూటౌన్/కామవరపుకోట/చింతలపూడి/కుక్కునూరు/నిడమర్రు/గణపవరం,మే 7: విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు బాటలో పయనించాలని ఏలూరులో ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ అన్నారు. తొలుత అల్లూరి వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కామవరపుకోట మండలంలో స్థానిక శాఖ గ్రంథాలయం వద్ద సీపీఐ నాయకుడు టీఎస్ రాజు ఆధ్వర్యంలో, చింతలపూడిలో ప్రజాసంఘాల కార్యాలయంలో సీపీఎం నాయకులు సూర్యకుమార్ ఆధ్వర్యంలో, కుక్కునూరు మండలం కుక్కునూరు సీఐటీయూ మండల సహాయ కార్యదర్శి టి.సురేష్ ఆధ్వర్యంలో, పత్తేపురంలో క్షత్రియ సేవా సంఘం అధ్యక్షుడు యుగంధర్ పెద్దిరాజు ఆధ్వర్యంలో, గణపవరం మండలం గణప వరంలో వివేకానంద సేవాసమితి అధ్యక్షుడు అల్లూరి గంగరాజు ఆధ్వర్యంలో చిత్ర పటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

టీడీపీలో చేరిందని.. మేట్‌ను తొలగించారు

ఏలూరు రూరల్, మే 7: తెలుగుదేశం పార్టీలో చేరిందని, ఉపాధి హామీ పథకంలో పనిచేసే ఒక మేట్‌ను తొలగించారు. ఏలూరు రూరల్ మండలం మల్కాపురం గ్రామానికి చెందిన ఎక్కుడు దేవిలక్ష్మి గత పంచాయతీ ఎన్నికల్లో రెండో వార్డు సభ్యురాలిగా వైసీపీ తరపున విజయం సాధించింది. రెండు రోజుల క్రితం దెందులూరు టీడీపీ అభ్యర్థి చింతమనేని ప్రభాకర్ సమక్షంలో ఆమె పార్టీలో చేరారు. ఆమె ఉపాధి హామీ పథకంలో మేట్‌గా పనిచేస్తోంది. ఆమె టీడీపీలో చేరిందనే అక్కసుతో ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు ఆమెను పనికిరావద్దంటూ ఆదేశాలు జారీ చేయటం వివాదస్పదమైంది. పార్టీలో చేరితే పనులకు రావద్దంటారా అంటూ ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఆరు నెలల క్రితం కూడా కె.కనకదుర్గ అనే మేట్‌ను కూడా తొలగించారని ఆమె తెలిపారు. ఆమెను తొలగించలేదని కొన్ని రోజులు పనులకు రావద్దని చెప్పామని, పేరు తీసి వేయలేదని అధికారులు చెబుతున్నారు.

క్రైం వార్తలు

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఏలూరు క్రైం, మే 7 : భార్యతో గొడవపడిన భర్త ఉరివేసుకుని అపస్మారక స్థితిలోకి వెళ్లి ఆపై చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. దెందులూరు మండలం మసీదుపాడుకు చెందిన గుడిపూడి సునీల్‌కుమార్(28)కు భార్య ప్రశాంతి, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. సునీల్‌కుమార్ అతిగా మద్యం తాగడంతో పాటు అప్పులు చేస్తుండడంతో అతని భార్య ఈనెల 6న మందలించింది. దీంతో ఇంట్లోకి వెళ్ళి తలుపులు వేసుకుని ఉరివేసుకున్నాడు. ఇరుగుపొరుగు వారి సహకారంతో తలుపులు పగలగొట్టి చూసేటప్పటికి అపస్మారక స్థితిలో ఉన్నాడు. అతడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్ పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

ముగ్గురిపై చీటింగ్ కేసు

ఏలూరు క్రైం, మే 7 : అద్దెకు తీసుకున్న కారు ఎంతకాలమైనా తిరిగి ఇవ్వకపోవడంతో ముగ్గురు వ్యక్తులపై ఏలూరు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదైంది. ఏలూరు రామచంద్రరావుపేట వాసావారి వీధికి చెందిన పేరాబత్తుల జయదీప్‌కు కార్లు అద్దెకు ఇస్తుంటాడు. 2022 నవంబర్ 24న ఏలూరు సమీపంలోని దుగ్గిరాలకు చెందిన ఇల్లంకి సాయిచరణ్, వడ్లపట్ల మాచిక, వడ్లపట్ల శ్రీకాంత్ వచ్చి తమ ఇంట్లో పెళ్ళి ఉందని సెల్ఫ్ డ్రైవింగ్‌తో క్రిస్టా ఇన్నోవా కారు అద్దెకు కావాలని రోజుకు రూ.మూడు వేలు ఇచ్చే విధంగా తీసుకువెళ్ళారు. అప్పటి నుంచి ఆ కారును తిరిగి అప్పజెప్పలేదు. దీంతో ఆ ముగ్గురిపై జైదీప్ ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో టూటౌన్ సీఐ ఎం.ప్రభాకర్ ఆధ్వర్యంలో ఆ ముగ్గురిపై చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


చాట్రాయిలో కురుస్తున్న భారీ వర్షం


రమణక్కపేట రహదారిలో చెరువును తలపిస్తున్న వర్షపునీరు


ముసునూరులో ఈదురు గాలులకు నేలకొరిగిన అరటిపంట


కాట్రేనిపాడులో విరిగిన విద్యుత్ స్తంభం

గాలి.. వాన బీభత్సం

»విరిగిన విద్యుత్ స్తంభాలు »ఒరిగిన అరటి తోటలు »జలమయమైన రహదారులు »సేదతీరిన ప్రజలు

ముసునూరు, మే 7: మండల వ్యాప్తంగా మంగళవారం మధ్యాహ్నం ఈదురు గాలి, ఉరుములు, మెరుపులతో కురిసిన భారీ వర్షం గ్రామాల్లో విధ్వంసం సృష్టించింది. ఈదురు గాలులకు ముసునూరు, అక్కిరెడ్డిగూడెం, చెక్కపల్లి తదితర గ్రామాల్లో గెల దశలో ఉన్న అరటిపంటలు నేలకొరిగి తీవ్రంగా దెబ్బతిన్నాయి. ముసునూరులో రైతు దేవినేని శ్రీవెంకటేశ్వర రావుకు చెందిన 4 ఎకరాలు గెల దశలో ఉన్న అరటిపంట పూర్తిగా దెబ్బతింది. సుమారు రూ. 3 లక్షల వరకు నష్టం వాటిలిందని రైతు వాపోయారు. అలాగే గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ లేక అంతర్గత, ప్రధాన రహదారులు చిన్నపాటి చెరువులను తలపించగా, వాగు, వంకలు పొంగిపొర్లాయి. రమణక్కపేట కుమ్మరి బజారులో వర్షపునీరు పోయే దారిలేక కొన్ని ఇళ్లలోకి చేరింది. అ రహదారిలో మోకాలులోతు వరకు నీరు ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్‌లకు సమాచారం ఇచ్చినా స్పందన లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పలు గ్రామాల్లో ఈదురు గాలులకు రహదారులపై పెద్ద, పెద్ద చెట్లు విరిగిపోయి రాకపోకలకు అంత రాయం ఏర్పడగా, వాటిని తొలగింపు చర్యలను అధికారులు చేపట్టారు. ఈదురు గాలుల విధ్వంసానికి మండల వ్యాప్తంగా 23 విద్యుత్ స్తంభాలు విరిగిపో వడంతో పలు గ్రామాల్లో సరఫరా నిలిచిపోయిందని ఏఈ ఆకుల హేమ సుందర్ కుమార్ తెలిపారు. సుమారు రూ. 2 లక్షల 30 వేలు నష్టం వాటిల్లిం దన్నారు. గ్రామాల్లో విద్యుత్ సరఫరాను పునరుద్ధరిచేందుకు ట్రాన్స్‌కో సిబ్బంది చర్యలు చేపట్టారు. ఎండలకు అల్లాడిన ప్రజలు ఈ భారీ వర్షానికి సేదతీరారు.

చాట్రాయి: ఈదురుగాలి, ఉరుములతో భారీ వర్షం కురవటంతో ప్రజలకు ఊరట లభించగా, మామిడికాయలు నేలరాలి రైతులు నష్టపోయారు. మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణ మారిపోయింది. ఉరుములతో సుమారు గంట సేపు వర్షం కురిసింది. ఈ ఏడాది మామిడి కాపు చాలా తక్కువగా వచ్చింది. ఇటీవల ధరలు తగ్గటంతో రైతులు కోతలు కొన్ని రోజులు వాయిదా వేసుకోగా, గాలివానకు కాయ మొత్తం రాలిపోయి తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆగిరిపల్లి: అకాలవర్షం మామిడి వ్యాపారుల్ని ముంచింది. మంగళవారం సాయంత్రం సుమారు గంటకు పైగా వర్షం కురవడంతో రోడ్లన్నీ జలమయం అయ్యాయి. మామిడి పంట చేతికి వస్తున్న తరుణంలో గాలివానతో కురిసిన ఈ వర్షం వల్ల మామిడి రైతులు, కొనుగోలుదారులు నష్టానికి గురయ్యారు.

నూజివీడు టౌన్: భానుడి భగభగల నుంచి నూజివీడు వాసులకు కాస్త ఉపశమనం లభించింది. మంగళవారం మధ్యాహ్నం నుంచి వాతా వరణంలో మార్పు చోటుచేసుకుని మూడు గంటల నుంచి ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఒక్కసారిగా మేఘాలు కమ్ముకుని చిరుజల్లులతో ప్రారంభమైన వర్షం దాదాపు రెండు గంటల పాటు కురిసింది. తొలుత ఈదురు గాలులు వీచినా మామిడి తోటలపై అంత ప్రభావం చూపకపోవడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. అసలే ఈ సీజన్‌లో మామిడి దిగుబడులు తగ్గి ఆందో ళనలో ఉన్న రైతులకు ఈదురు గాలుల ప్రభావం ఉంటే మరింత నష్టపోవాల్సి వచ్చేదని, వర్షం ముందు ఓ మోస్తరు ఈదురుగాలులు వీచినా అంతగా కాయ రాలకపోవడంతో పెద్దనష్టం జరగలేదని రైతులు పేర్కొం టున్నారు. అయితే దాదాపు ఐదునెలల తరువాత పడిన వర్షంవల్ల మామిడి తోటలు, ఇతర ఉద్యానవన పంటలకు కొంత మేలు చేకూరుతుందని రైతులు చెబుతున్నారు.

ముదినేపల్లి: రెండు నెలలుగా తీవ్రమైన ఎండ, వడగాల్పులతో ఉక్కిరిబిక్కిరి అయిన గ్రామీణ ప్రజలు మంగళవారం సాయంత్రం కురిసిన భారీ వర్షం నుంచి ఊరట లభించింది. ఈదురుగాలులతో ముదినేపల్లి ప్రాంతంలో రెండు గంటల పాటు కురిసిన వర్షంతో ప్రజలు సేదతీరారు. గాలులకు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

కలిదిండి: కలిదిండిలో మంగళవారం మధ్యాహ్నం రెండు గంటల పాటు ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. చెట్ల కొమ్మలు విరిగి పడ్డాయి. ముందస్తుగా విద్యుత్ సరఫరా నిలిపివేశారు. కొద్ది రోజులుగా మండుతున్న ఎండల నుంచి ప్రజలు ఉపశమనం పొందారు. అంతర్గత రహదారులు జలమయమయ్యాయి. అకాల వర్షంతో చెరువుల్లో నీరు చల్లబడి ఆక్సిజన్ లోపించి రొయ్యలు మృత్యువాత పడే ప్రమాదం ఉందని ఆక్వా రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈదుగాలులతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగటంతో అద్దె జనరేటర్లను ఏర్పాటు చేసి చెరువులో ఏరియేటర్లు తిప్పుతున్నారు.


అల్లూరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న క్షత్రియ సంఘ నాయకులు

విప్లవ వీరుడు అల్లూరికి ఘన నివాళి

ముదినేపల్లి, మే 7: విప్లవ వీరుడు అల్లూరి సీతరామరాజు వర్ధంతిని మంగళవారం ముదినేపల్లి మండలం రాజానగరంలో నిర్వహించారు. స్థానిక క్షత్రియ సంక్షేమ సంఘం నాయకులు సాగి సుబ్బరాజు, కొండరాజు, ఆంజనేయ రాజు, సాగిరాజు సూర్యనారాయణరాజు, సాగిరాజు సత్యనారాయణరాజు, క్షత్రియ యువజన సంఘ నాయకులు అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కలిదిండి: విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం తాడినాడలో అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కొత్తపల్లి బంగార్రాజు, రంగ రాజు, చేకూరి రామకృష్ణంరాజు, సూర్యనారాయణ రాజు పాల్గొన్నారు. భాస్కర రావుపేటలో మంతెన సుబ్బరాజు, సతీష్ రాజు, ఎస్‌వి రాజు, రామరాజు అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



ముసునూరులో జూనియర్ అసిస్టెంట్‌కు రైతులు.. ముదినేపల్లి తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి కూటమి నేతలు వినతిపత్రాలిస్తున్న దృశ్యం

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను రద్దు చేయాలి

»రైతులు, కూటమి నాయకుల నిరసన

»తహసీల్దార్ కార్యాలయాల్లో వినతిపత్రాలు అందజేత

ముసునూరు, మే 7: రైతుల భూములపై యాజమాన్య హక్కును హరించేలా వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్-2022ను తక్షణమే రద్దు చేయాలని రైతు, టీడీపీ మండల అధ్యక్షుడు దేవినేని బలరాం డిమాండ్ చేశారు. మంగళవారం రైతులతో కలిసి ఆయన తహసీల్దార్ కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ యాక్ట్ ద్వారా టైటిల్ రిజిస్ట్రేషన్, ల్యాండ్ అప్పిలేట్ అథారిటీల నియామక పత్రాలు, వివాదాల రిజిస్టర్ నిర్వహణ, యాజమాన్య హక్కుల వివాదాల పరిష్కారంలో సివిల్‌కోర్టుల పాత్రను పూర్తిగా తొలగించడం, రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన ఒరిజినల్ పత్రాలను యజమానులకు అందించకపోవడం తదితర నిబంధనల వల్ల రైతులు తమ భూములపై యాజమాన్య హక్కులను కోల్పోయే ప్రమాదం ఉందని, తక్షణమే ఈ యాక్ట్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు కొండేటి బాబి, తోట శ్రీను, పి.సీతారామ్, దేవినేని సాంబయ్య రేగుల చంద్రశేఖర్‌రావు, రెడ్డి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లి: ల్యాండ్ టైటిలింగ్ యాక్టును వ్యతిరేకిస్తూ తెలుగుదేశం, బీజేపీ, జనసేన నాయకులు మంగళవారం ముదినేపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. టీడీపీ కైకలూరు నియోజకవర్గ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, పార్టీ జిల్లా కార్యదర్శి పోసిన పాండురంగారావు, మండల ప్రధాన కార్యదర్శి బొంగు రవికుమార్, నియోజకవర్గ కో-కన్వీనర్ తేరా రమేష్, జనసేన మండల కన్వీనర్ వీరంకి వెంకటేశ్వర రావు, బీజేపీ సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ భుజంగ నరసింహారావు, మాజీ ఎంపీటీసీ కట్టా కోటేశ్వరరావు తదితరులు ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కార్యాలయ సిబ్బందికి మెమొరాండం అందజేశారు. అనంతరం చట్టం ప్రతులను చించి వేశారు.

45 రోజులుగా తాగునీటి వెతలు


వినతిపత్రం ఇస్తున్న మల్లేశ్వరరావు

ముసునూరు, మే 7: రమణక్క పేట గ్రామ పంచాయతీ ఓసీ ఏరియాలో తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ కాలనీ వాసి రంగు మల్లేశ్వర రావు మంగళవారం ఎంపీడీవో కార్యాల య సీనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్లేశ్వరరావు మాట్లాడుతూ ఓసీ ఏరియాలో గాదేవారి వీధిలో ఉన్న 50 కుటుంబాలకు నీటి సరఫరా చేసే బోరు మరమ్మతుకు గురై 45 రోజులు కావస్తున్నా సర్పంచ్, పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. దీంతో తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతు న్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను పరిష్కరించేలా ఉన్నతాధికా రులు చర్యలు తీసుకోవాలని మల్లేశ్వరరావు కోరారు.


పోస్టల్ బ్యాలెట్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్వో భవానీ శంకరి

ఓటు హక్కు వినియోగించుకున్న 235 మంది

నూజివీడు, మే 7: నూజివీడు నియోజకవర్గంలో మంగళవారం వరకు 1687 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటుహక్కును వినియోగించుకున్నారని, నూజివీడు ఆర్డీవో వై.భవాని శంకరి తెలిపారు. నూజివీడు నియోజకవర్గం పరిధిలో పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ ప్రశాంతంగా సాగింది. నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేయగా, మంగళవారం మొత్తం 235 మంది తమ పోస్టల్ బ్యాలెట్‌ను ఉపయోగించుకున్నట్లు తెలిపారు. నూజివీడు నియోజకవర్గ పరిధిలో 183 మంది ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు తమ పోస్టల్ బ్యాలెట్‌ను నమోదు చేయగా, ఇతర నియోజకవర్గాలకు చెందిన 52 మంది సైతం నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలోని ఫెసిలిటేషన్ సెంటర్లో తమ పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నారు. మొత్తం రెండు విడతల్లోనూ 1687 మంది సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటుహక్కును వినియోగించుకున్నట్లు ఆమె తెలిపారు.

నేడు కామినేనితో హీరో వెంకటేష్ ప్రచారం

కైకలూరు, మే 7: కైకలూరు అసెంబ్లీ బీజేపీ అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్‌కు మద్దతుగా ప్రముఖ సినీ హీరో వెంకటేష్ బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నట్టు కూటమి నాయకులు తెలిపారు. బుధవారం కలిదిండి మండలం కోరుకొల్లులో సాయంత్రం 5 గంటలకు ర్యాలీ ప్రారంభం అవుతుందన్నారు. వేమవరప్పాడు, తామరకొల్లు, వింజరం, ఆచవరం గ్రామాల మీదుగా కైకలూరు చేరుతుందన్నారు. ఫైర్ ఆఫీస్ రోడ్డు నుంచి వారపు సంత వరకు బైపాస్ రోడ్డుమీదుగా తాలుకా సెంటర్‌కు అక్కడి నుంచి రైల్వేస్టేషన్ రోడ్డు మీదుగా కలిదిండి రోడ్డులోకి అక్కడి నుంచి శ్రీశ్యామలాంబ అమ్మవారి ఆలయానికి చేరుకుంటారన్నారు. హీరో వెంకటేష్ అక్కడ ప్రజలనుద్దేశించి మాట్లాడతారన్నారు. ర్యాలీలో కూటమి నాయకులంతా పెద్దఎత్తున పాల్గొనాలని కామినేని పిలుపునిచ్చారు.

నేడు గౌడ సంఘం ఆత్మీయ సమావేశం

నూజివీడు టౌన్, మే 7: గౌడ సంఘ ఆత్మీయ సమావేశాన్ని నూజివీడు విశ్వేశ్వర హాల్లో నిర్వహిస్తున్నట్లు నూజివీడు నియోజకవర్గ గౌడ సంఘం నాయకులు తెలిపారు. బుధవారం సాయంత్రం 5 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి మచిలీపట్నం మాజీ ఎంపీ కొనకళ్ళ నారాయణ, ఉమ్మడి కృష్ణా జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు వీరంకి వెంకటగురుమూర్తి, రాష్ట్ర బీసీసంఘం అధ్యక్షులు కేశనశంకర్‌రావు, ఏలూరు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి పుట్టా మహేష్‌యాదవ్, నూజివీడు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కొలుసు పార్థసారథి ముఖ్య అతిథులుగా పాల్గొంటారని వారు తెలిపారు.

నేడు కలిదిండిలో కామినేని ప్రచారం

కలిదిండి, మే 7 : కైకలూరు నియోజకవర్గ కూటమి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ బుధవారం కలిదిండి మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి తెలిపారు. తాడినాడ, చినతాడినాడ, విభరాంపురం, దుంపల కోడుదిబ్బ గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తారని టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

రేపు ఎంపీ అభ్యర్థి మహేష్ ప్రచారం

ముదినేపల్లి, మే 7 : ఏలూరు లోక్‌సభ నియోజకవర్గ కూటమి ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్ ముదినేపల్లి మండలంలో గురువారం భారీ బైక్ ర్యాలీతో ప్రచారం నిర్వహించనున్నట్లు టీడీపీ కైకలూరు నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జ్ కొడాలి వినోద్ తెలిపారు. మండలంలోని దాకరం నుంచి ప్రారంభమయ్యే ఈ రోడ్ షో పేరూరు, పెయ్యేరు, ముదినేపల్లి, వడాలి, చిగురుకోట, తామరకొల్లు, కోరుకొల్లు మీదుగా బొమ్మినంపాడు చేరుకుని అల్లూరు, పెదగొన్నూరు, దేవపూడి, ప్రొద్దువాక మీదుగా వైవాక చేరుకుంటుందని, అక్కడ ముగింపు సభ జరుగుతుందని తెలిపారు.

కృత్రిమ కాళ్ల వితరణ

ఆగిరిపల్లి, మే 7: కృత్రిమ అవయవాలతో దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసం పెంచవచ్చని మోహన్ స్పిన్‌టెక్స్ అధినేత వల్లభనేని సుధాకర్ చౌదరి అన్నారు. యార్లగడ్డ జయప్రద, రామయ్య చారిటీస్ ఆర్థిక సాయంతో తోటపల్లిలో గల హీల్ కృత్రిమ అవయవ కేంద్రం సహకారంతో గుంటూరు జిల్లా వట్టిచెరుకూరుకు చెందిన నెల్లూరి మదన్‌మోహన్‌రావు, బాపట్ల బాబుకు కృత్రిమ కాళ్ళు అందజేసి మాట్లాడారు. హీల్ కార్యదర్శి శ్రీమతి తాతినేని లక్ష్మి, క్యాంపస్ చైర్మన్ పిన్నమనేని ధనప్రకాష్, హీల్ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.


వైసీపీ నాయకులకు కండువా కప్పి కూటమిలోకి ఆహ్వానిస్తున్న కైకలూరు అసెంబ్లీ కూటమి అభ్యర్థి కామినేని శ్రీనివాస్


కైకలూరులో ప్రచారం నిర్వహిస్తున్న కామినేని తనయుడు విజయ్, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు

ఆక్వా రంగ అభివృద్ధికి కృషి : కామినేని

ముదినేపల్లి, మే 7 : వైసీపీ ప్రభుత్వ విధానాలతో అస్తవ్యస్తమైన ఆక్వా రంగ అభివృద్ధికి కృషి చేస్తానని కైకలూరు అసెంబ్లీ నియోజకవర్గ కూటమి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ హామీ ఇచ్చారు. ముదినేపల్లి మండలం చేవూరు, కోమర్రు గ్రామాల్లో మంగళవారం రాత్రి ఆయన ప్రచారం నిర్వహించి ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఆక్వా రైతులను ఆదుకునేందుకు, సబ్సిడీల పునరుద్ధరణకు కృషి చేస్తానని తెలిపారు. ఐదేళ్లుగా స్థానిక ఎమ్మెల్యే నియోజకవర్గ సమస్యలను పట్టించు కోలేదని విమర్శించారు. చేవూరు, కోమర్రులో కామినేనికి గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. నియోజకవర్గ టీడీపీ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, పోల్ మేనేజ్‌మెంట్ కన్వీనర్ కొడాలి వినోద్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణారావు, జనసేన మండల కన్వీనర్ వీరంకి వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు కొత్తూరు విఠల్, చలసాని జగన్మోహనరావు, పరసా విశ్వేశ్వరరావుతోపాటు జనసేన నాయకుడు కూనపరెడ్డి రాజా తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి ఓటమి తప్పదు

కైకలూరు, మే 7: ఎన్నికల్లో వైసీపీకి ఓటమి తప్పదని, వారి పాలనలో ప్రజలు దుర్భర పరిస్థితులను ఎదుర్కొన్నారని మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు అన్నారు. మంగళవారం కైకలూరు వెలంపేట కాలనీలో కూటమి అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ కుమారుడు డాక్టర్ విజయ్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ మొదటి ఈవీఎంలో నాల్గవది సైకిల్ గుర్తు అని, రెండో ఈవీఎంలో మొదటి స్థానంలో కమలం గుర్తుకు ఓటు వేసి ప్రజలు గెలిపించాలని కోరారు. వైసీపీ వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. ఎన్నికల మేనిఫెస్టోను, టీడీపీ ప్రభుత్వం వస్తే అందించే సంక్షేమ పథకాలను వివరించారు. కూటమి నాయకులు తెంటు నాగేశ్వరరావు, డోకల శ్రీనివాసరావు, పెన్మెత్స త్రినాథరాజు, వీరాబత్తిన సుధా, కేకే బాబు, పి. రాధాకృష్ణ, బంకపల్లి భాస్కరరావు, సమతం శ్రీనివాస్, బెల్లాని శ్యామలరావు తదితరులు పాల్గొన్నారు.

కూటమిలో చేరిన వైసీపీ నేతలు

అభివృద్ధి, సమాజ శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని వైసీపీ నుంచి నాయకులు, కార్యకర్తలు కూటమిలో చేరుతున్నారని కైకలూరు అసెంబ్లీ బీజేపీ అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కైకలూరు మండలం వరహాపట్నంలో కైకలూరు వార్డు మాజీ సభ్యుడు బుర్ల సత్యనారాయణ, గురుగుబెల్లి సింహాచలం, నల్లగచ్చు కుశల్ కుమార్, జి. దుర్గాప్రసాద్ తదితరులు మాజీ ఎంపీపీ నర్సిపల్లి అప్పారావు, టీడీపీ నాయకుడు బీకేఎం నాని ఆధ్వర్యంలో టీడీపీలో చేరగా వారికి కామినేని కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే కలిదిండి మండలంలో మూలలంక గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు షేక్ కరీముల్లా, ఉండి రాజశేఖర్‌రెడ్డి ఆ పార్టీని వీడి కామినేని సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కామినేని మాట్లాడుతూ సమాజంలో మంచి చేసే వ్యక్తులను గుర్తించి పార్టీలు మారుతు న్నారన్నారు. వైసీపీ పాలనలో పడిన ఇబ్బందులతో ప్రజలు విసిగిపోయి స్వచ్ఛందంగా కూటమిలో చేరేందుకు ముందుకు వస్తున్నారన్నారు. కైకలూరు సర్పంచ్ డీఎం నవరత్నకుమారి, పార్టీ మండల అధ్యక్షులు పెన్మెత్స త్రినాథ రాజు, కూటమి నాయకులు పూల రామచంద్రరావు, బోయిన రామకృష్ణ, అంద్రాజు శ్రీనివాసరావు, నర్సిపల్లి వెంకన్న, బోయిన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కూటమి నాయకుల మజ్జిగ వితరణ



కలిదిండి, మే 7 : పడమటిపాలెంలో మంగళవారం కూటమి నాయకులు ఉపాధి కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఉపాధి కూలీలు పని ప్రదేశంలో టెంటులు, తాగునీరు, ఫస్ట్ ఎయిడ్ కిట్స్ అందుబాటు లో ఉంచాలని డిమాండ్ చేశారు. కూటమి నాయకులు పరసా రాజేష్, చిట్టూరి అర్జునరావు, సుదాబత్తుల నరసింహారావు, గుర్రాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వెయ్యి మందికి దాతలు మజ్జిగ పంపిణీ



ముదినేపల్లి, మే 7 : వేసవి దాహార్తిని తీర్చేందుకు ముదినేపల్లిలో ఏర్పాటు చేసిన చలి వేంద్రంలో మంగళవారం దాతలు సుమారు 1000 మందికి మజ్జిగ పంపిణీ చేశారు. స్థానిక విజయలక్ష్మి ట్రాన్స్‌పోర్టు యజమాని ఎనుముల అంకినీడు వితరణతో ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రంలో గత 15 రోజులుగా మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ మండల చైర్మన్ వెలివెల గోపీనాథ్‌తో పాటు పలువురు దాతలు మజ్జిగ పంపిణీ చేస్తున్నారు.

ఉద్యోగి కుటుంబానికి చేయూత

చాట్రాయి, మే 7: చాట్రాయి ఎంఈవో ఆఫీస్‌లో కాంట్రాక్ట్ కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తూ ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన కంకట బాబూరావు కుటుంబానికి జిల్లాలోని తోటి ఉద్యోగులు అందరూ కలిసి రూ. లక్ష సాయం అందించారు. సమగ్ర శిక్ష అభియాన్ జిల్లా కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ సభ్యుల నుంచి విరాళాలు సేకరించిన మొత్తం రూ. లక్ష మృతుడి కుమార్తె పేరిట పోస్టాఫీస్‌లో ఫిక్సెడ్ డిపాజిట్ చేసి, మంగళవారం ఏలూరులో డీఈవో అబ్రహం, ఏపీసీ సోముశేఖర్ చేతుల మీదుగా మృతుడి భార్య, కుమార్తెకు ఎఫ్‌డీ బాండ్ అందజేశారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం



చాట్రాయి, మే 7: ఇటీవల చింతలపూడి మండలం నాగిరెడ్డిగూడెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కోటపాడు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త మోనూరు దుర్గారావు కుటుంబానికి, పార్టీ గ్రామ అధ్యక్షుడు మంచిన పూర్ణచంద్రరావు మంగళవారం రూ. 10 వేలు సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుర్గారావు కుటుంబానికి పార్టీ అండగా ఉండటంతో పాటు, తెలుగుదేశం కార్యకర్తల సంక్షేమ నిధి నుంచి రూ. 2 లక్షలు సాయం అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

ఎన్నికల స్పెషల్

నోటా మెజారిటీ సాధిస్తే..?



ఎన్నికల్లో పోటీ పడిన అభ్యర్థులలో ఎవరు ఎక్కువ ఓట్లు సాధిస్తే వారే విజేత. అభ్యర్థులందరి కంటే 'నోటా'కు ఎక్కువ ఓట్లు వస్తే ఏంటి పరిస్థితి. ఏం లేదు సింపుల్.. నోటా తర్వాత అధికంగా ఓట్లు సాధించిన అభ్యర్థిని విజేతగా ప్రకటిస్తారు. నోటాకు ఎక్కువ ఓట్లు పోలయ్యాయంటే పోటీ చేసిన వారిలో ఏ ఒక్క అభ్యర్థి ఓటర్లకు నచ్చలేదని అర్థం. అంటే పరోక్షంగా అభ్యర్థులందరూ ఓడినట్లే లెక్క. అదే న్యాయమని చాలా మంది అభిప్రాయపడతారు. కానీ నిబంధనలు వేరేవిధంగా చెబుతున్నాయి. నోటాకు అధికంగా ఓట్లు పోలైన సందర్భాల్లో వాటిని పరిగణనలోకి తీసుకోరు. ఆ ఓట్లను రద్దయినట్లు ఎన్నికల సంఘం పరిగణిస్తుంది. నోటా తరువాత అత్యధికంగా ఓట్లు పొందిన వ్యక్తిని గెలిచినట్లు ప్రకటిస్తారు. ఇంతకీ ప్రజాభిప్రాయం ఓడిపోయినట్లేనంటారా..!

\- అత్తిలి

కాయ్ రాజా కాయ్

ఎన్నికల ఫలితాలపై పందేలకు సై

సార్వత్రిక ఎన్నికల్లో పందేలకు తెరతీశారు. అభ్యర్థుల విజయంపై కొందరు పందేలు కడుతున్నారు. మండల స్థాయిలో మెజారిటీల నుంచి రాష్ట్రస్థాయిలో ఏ పార్టీకి మెజారిటీ వస్తుందన్న విషయంపై పందాలకు కాయ్.. రాజా.. కాయ్ అంటున్నారు. ప్రధాన పార్టీల విజయావకాశాలపై పందేలు కట్టేందుకు ఎన్‌డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు కాలు దువ్వుతున్నారు. కైకలూరు నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి విజయంపై ఒకటికి రెండు రెట్లు పందేలకు రెడీ అంటున్నారు. రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి వస్తుందని కూడ కూటమి తరపున పందేలకు పెద్ద సంఖ్యలో సై అంటున్నారు. పిఠాపురంలో పవన్ కళ్యాణ్ గెలుపుపై కూడ పందాలు జరుగుతున్నాయి.

ఖర్చు తడిసి మోపెడు..



ఈసారి ఎన్నికల షెడ్యూల్ ప్రకటన, నోటిఫికేషన్, నామినేషన్లు పోలింగ్ తేదీ, ఫలితాలు వెల్లడి మధ్య సుదీర్ఘ సమయం ఉండటంతో బరిలో నిలిచిన అభ్యర్థులకు ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. పోలింగ్ ఎప్పుడు పూర్తవుతుందా అని ఎదురుచూస్తున్నారు. ప్రచార ఆర్భాటానికి భారీ ఖర్చు అవుతుందని, ఇంతగా ఏనాడు లేదని కుయ్యో.. మొర్రో అంటున్నారు. మండుటెండల్లో ప్రచారానికి రోజూ పనులు మానుకుని వచ్చే వారు లేరు. రోజు వారీ మర్యాదలు, ఇతర ఖర్చులు ఉంటాయి. కార్యకర్తలకు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్ టీ, రాత్రికి డిన్నర్ ఏర్పాటు చేయాల్సిందే. మరీ ఎండల్లో తిరుగుతున్నందుకు వారిని కూల్ చేసేందుకు మధ్యలో శీతలపానీయాల సరఫరా చూస్తుంటే ఎన్నికలు ఎప్పుడు ముగుస్తాయి రా బాబూ అభ్యర్థులు తలలు పట్టుకుంటున్నారు. కైకలూరులో ఈసారి ప్రచార ఆర్భాటం ఎక్కువగానే ఉంది.

\- ముదినేపల్లి